
మోకాలడ్డు..!




మారుమూల అటవీ ప్రాంతంలోని మొటుకుపల్లె



అటవీ ప్రాంతంలో విద్యుత్తు స్తంభాన్ని చుట్టేసిన తీగలు

● అటవీ పరిధిలో విద్యుత్ స్తంభాలు నాటొద్దు

● అడ్డుకున్న అటవీ శాఖ ● ఆగిన విద్యుత్తుశాఖ పనులు



అటవీశాఖ సరిహద్దు వరకు నాటి ఆపేసిన విద్యుత్తు స్తంభాలు

మదనపల్లె, మే 3 (ఆంధ్రజ్యోతి): అది తంబళ్లపల్లె నియోజకవర్గం బి.కొత్తకోట మండలంలోని మారుమూల అటవీ ప్రాంతం. అటు కర్ణాటక సరిహద్దు, ఇటు హార్సిలీ హిల్స్ దిగువ ప్రాంతంలోని తొమ్మిది గ్రామాల సముదాయం. కొండలు, కోనలు, వాగులు, వంకల మధ్య ఉండే ఈ గ్రామాలు స్థానికులకు తప్ప పెద్దగా ఎవరికీ తెలియవు. మదనపల్లె నుంచి మొటుకుపల్లెకు వెళ్లాలంటే కర్ణాటక రాష్ట్రం రాయల్పాడు మీదుగా తర్వాత ఏపీలోని మొటుకుపల్లెకు వెళ్లాల్సి ఉంటుంది. అలాగే మరోమార్గం మదనపల్లె-బి.కొత్తకోట మార్గం గుండా నాయనబావి మీదుగా మొటుకుపల్లెకు వెళ్లొచ్చు. కానీ ఎక్కువగా అటవీ ప్రాంతంలోని మలుపుల రోడ్డు, దానికి మించి ఎత్తుపల్లాలుగా ఉండటంతో వాహనాలు వెళ్లలేని పరిస్థితి. అందుకే ఆర్టీసీ బస్సులు కూడా ఈ మార్గంలో నడపడం లేదు. దీనికి ప్రత్యామ్నాయంగా రెండోమార్గమైన కర్ణాటకలోని రాయల్పాడు మీదుగా మొటుకుపల్లెకు వెళుతున్నాయి. అది కూడా సాయంత్రం 6 గంటలు దాటిందంటే ఆ మార్గంలో రాకపోకలు కూడా బంద్ అవుతున్నాయి. ఇలాంటి రిజర్వు ఫారెస్టు ఏరియాలోని తొమ్మిది గ్రామాల రైతులు వ్యవసాయం, ఇతర వాణిజ్య పంటలపై ఆధారపడి జీవిస్తున్నారు.

మొటుకుపల్లెకు వెళ్లాలంటే రోడ్డు మార్గం నుంచి పది కిలోమీటర్లు ఉండగా, ఆరు కి.మీ. అడవి మార్గం గుండా వెళ్లాల్సి ఉంది. అయిదేళ్లకు ముందు సరైన రోడ్డు సౌకర్యం లేక స్థానికులు ఇబ్బంది పడుతుండగా, తర్వాత రోడ్డు నిర్మాణం చేపట్టడంతో కనీసం అక్కడి నుంచి బయటి ప్రాంతానికి రాకపోకలు సాగిస్తున్నారు. ఈ ప్రాంతానికి బి.కొత్తకోట మండలంలోని బడికాయలపల్లె సబ్‌స్టేషన్ నుంచి 1996లో అప్పటి మదనపల్లె ఎమ్మెల్యే రాటకొండ సాగర్‌రెడ్డి హయాంలో మొదటిసారిగా విద్యుత్తు లైన్ ఏర్పాటు చేశారు. అప్పట్లోనే విద్యుత్తు లైన్ పనులకు అటవీ శాఖ అడ్డు చెప్పగా అప్పటి రాజకీయ పరిస్థితులు, స్థానిక గ్రామాల అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని లైన్ ఏర్పాటు చేశారు. తర్వాత మదనపల్లె-బి.కొత్తకోట మార్గంలోని నాయనబావి గ్రామంలో 2013లో ఏర్పాటైన విద్యుత్తు సబ్‌స్టేషన్ నుంచి అటవీ శాఖ సరిహద్దు ప్రాంతమైన టేకులపెంట వరకు మరో విద్యుత్తులైన్ ఏర్పాటు చేశారు. విద్యుత్తు శాఖ సంస్కరణల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం తాజాగా గ్రామీణ ప్రాంతాలకు అదనంగా మరోలైన్ ఏర్పాటు చేస్తోంది. ఇప్పటికే ఉన్న లైన్‌ను వ్యవసాయం నుంచి వేరు చేసి గ్రామాల్లో 24 గంటలు విద్యుత్తు సరఫరాకు శ్రీకారం చుడుతోంది. దీంతో గ్రామీణ ప్రాంతాలకు తాగునీటి పథకాలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నది ప్రధాన ఉద్దేశ్యం.

నాయనబావి సబ్‌స్టేషన్ నుంచి మొటుకుపల్లెకు లైన్ మంజూరు కాగా ప్రస్తుతం విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేస్తున్నారు.అయితే 24 గంటల విద్యుత్తు సరఫరా లైన్ ఏర్పాటులో భాగంగా ప్రస్తుతం సమస్య వచ్చిపడింది. విద్యుత్తు శాఖ తారురోడ్డు వెంబడి స్తంభాలు నాటుతుండగా అటవీశాఖ అడ్డు చెబుతోంది. అనుమతి లేకుండా ఫారెస్టు భూమిలో విద్యుత్తు లైన్ లాగొద్దంటూ ఆక్షేపిస్తోంది. దీంతో విద్యుత్తు లైన్ పనులు అటు కిలోమీటరు, ఇటు మూడు కి.మీ.దూరం జరుగుతున్నా..మధ్యలో ఆరు కి.మీ.ఆగిపోయాయి. బడికాయలపల్లె సబ్‌స్టేషన్ నుంచి 1996లో ఈ తొమ్మిది గ్రామాలకు ఏర్పాటు చేసిన 11 కె.వి.లైన్ కూడా ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. 28 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ లైన్ సొంతం అటవీ మార్గం గుండా వెళ్తుండటంతో విద్యుత్తు వైర్లు చెట్లు, పెద్ద పెద్ద వృక్షాల మధ్యలో ఉండిపోయాయి. వర్షాకాలంలో గాలి, వానతో చెట్లు కూలి విద్యుత్తు స్తంభాలు విరిగిపడిపోవడం, వైర్లు తెగిపోవడం సాధారణమైంది. ఈ గ్రామాల్లో అప్పుడున్న విద్యుత్తు వినియోగం, గృహాలు, వ్యవసాయ సర్వీసులకు అనుగుణంగా 34 ఎంఎం కండెక్టర్, ఎనిమిది మీటర్ల ఎత్తు గల విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం విద్యుత్తు సర్వీసులు విపరీతంగా పెరుగుతున్నా ఆ స్థాయిలో మెరుగైన విద్యుత్తు సరఫరా లేకపోవడంతో రైతులను లోవోల్టేజీ సమస్య వెంటాడుతోంది. వర్షాకాలం వచ్చిందంటే, ఈ గ్రామాలకు విద్యుత్తు సరఫరా ఉండదు. లైన్ మొత్తం అడవిమార్గంలో ఉండటంతో రాత్రివేళలో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడితే పునరుద్ధరణకు ఒకటి రెండు రోజులు పట్టే అవకాశం ఉంది. పైగా లైన్‌ను మొత్తం చెట్లు, వృక్షాలు చుట్టేయడంతో గాలి వచ్చినా లైన్ ట్రిప్పు అయిపోతోంది. తుప్పు పట్టిన స్తంభాలు, అతుకులు పడిన వైర్లు దర్శనమిస్తున్నాయి. ఇక్కడ చెట్లు, తీగలను ఎప్పటికప్పుడు క్లియర్ చేయకపోవడంతో విద్యుత్తులైన్లు మొత్తం చెట్లపొదల్లో ఉండిపోయాయి. దీంతో అటవీ జంతువులకు కూడా విద్యుత్తు సరఫరా అయ్యే అవకాశం లేకపోలేదు. ప్రస్తుతం ఈ లైన్ స్థానంలో కొత్త లైన్ ఏర్పాటు చేయాలని స్థానిక రైతులు కోరుతున్నారు.




ఫారెస్టులో కూలడానికి సిద్ధంగా ఉన్న 11 కేవీ విద్యుత్ స్తంభం

అప్పుడు లేని ఆక్షేపణ ఇప్పుడెందుకో?

గత వైసీపీ ప్రభుత్వంలో అటవీ ప్రాంతంలో ఏకంగా పది కి.మీ.పైగా తారురోడ్లు నిర్మించారు. ఎలాంటి అనుమతులు లేకున్నా అటవీ శాఖ అధికారుల ఆదేశాలను ఖాతరు చేయకుండా వీటిని వేశారు. ఇందులో నాయనబావి నుంచి మొటుకుపల్లెకు, అక్కడి నుంచి స్టేట్ బార్డర్ వరకూ నిర్మించారు. తిరిగి అక్కడి నుంచి చిన్నపల్లె మీదుగా ముడివారిపల్లెకు రోడ్డు, పులుసుమానిపెంట, మెయిన్‌రోడ్డు నుంచి తంగేవారిపల్లె వరకూ మరో రోడ్డు నిర్మించారు. ఈ రోడ్లకు అప్పుడు లేని ఆక్షేపణ ఇప్పుడు విద్యుత్తు లైన్‌కు ఎందుకని స్థానికులు ఆక్షేపిస్తున్నారు. ఇక్కడే కాదు..కురబలకోట మండలంలోని తెట్టు నుంచి మదనపల్లె మండలం ఎగువమిట్టామర్రి అటవీ ప్రాంతంలో, అడవిలోపల్లె నుంచి కొండమీదపల్లెకు, తంబళ్లపల్లె మండలం తంబళ్లపల్లె మల్లయ్యకొండకు, చౌడేపల్లె మండలంలోని బోయకొండ, తదితర ప్రాంతాల్లో వైసీపీ నేతలు అటవీ ప్రాంతంలో అక్రమంగా తారురోడ్లు నిర్మించినా అడ్డుచెప్పని అటవీ శాఖ ఇప్పుడు చెట్లు, వృక్షాలకు ఎలాంటి నష్టం లేకుండా కేవలం రోడ్డు వెంట పైభాగంలో వెళ్లే విద్యుత్తులైన్‌ను అడ్డుకోవడం ఏంటని రైతులు ప్రశ్నిస్తున్నారు.

సింగన్నగారిపల్లె సమీపంలో చిరుతపులి సంచారం

కురబలకోట, మే 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎర్రబల్లి పంచాయతీ సింగన్నగారిపల్లె సమీపంలో చిరుతపులి సంచరిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఒక రైతు తన పొలంలో సాగు చేసిన టమోటా కాయలను కోసేందుకు వెళ్లాడు. అక్కడికి సమీపంలో సంచరిస్తున్న చిరుతపులిని చూసి భయాందోళనలకు గురై గ్రామంలోకి పరుగులు తీసి చిరుత సంచరిస్తున్న విషయాన్ని గ్రామస్థులకు తెలియజేశారు. గ్రామస్తులందరూ అక్కడికి వెళ్లి చూడగా అక్కడి నుంచి అప్పటికే చిరుత వెళ్లిపోయింది. ఆ ప్రాంతంలో పులి సంచరించిన గుర్తులు కనబడ్డాయి. దీంతో విషయాన్ని అటవీ శాఖాధికారులకు తెలియచేయడంతో వారు గ్రామానికి చేరుకుని వివరాలు తెలుసుకుని పొలాలకు వెళ్లేటపుడు జాగ్రత్తగా ఉండాలని గ్రామస్థులకు తెలిపారు.



సింగన్నగారిపల్లె సమీపంలో పులి సంచరించడంతో గుమికూడిన గ్రామస్థులు

కంపోస్టు యార్డును పరిశీలించిన జేడీ

● తడి, పొడి చెత్తను వేరు చేయాలని సూచన

మదనపల్లె, మే 3 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మున్సిపాలిటీ పరిధిలోని కంపోస్టుయార్డును స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ జాయింట్ డైరెక్టర్ (జేడీ) భాగ్యలక్ష్మి శనివారం తనిఖీ చేశారు. తట్టివారిపల్లె సమీపంలోని కంపోస్టుయార్డును కమిషనర్ కె.ప్రమీలతో కలసి అక్కడ బ్లూప్లానెట్ సొల్యూషన్స్ తయారు చేస్తున్న ఎరువుల తయారీని పరిశీలించారు. పట్టణంలోని రోజువారీ 70 టన్నుల వ్యర్థాలు వస్తున్నాయని, ఇందులో 36 టన్నుల వరకు తడి చెత్త ఉంటోందని, దీని ద్వారానే ప్రైవేటు సంస్థ ఎరువులు తయారు చేస్తున్నట్లు జేడీకి కమిషనర్ వివరించారు. ఇంటింటా చెత్త సేకరణలో భాగంగానే తడి, పొడి చెత్తను వేరు చేసి ఇస్తేనే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని చెప్పారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచే క్రమంలో ఎప్పటికప్పుడు చెత్తను యార్డుకు తరలించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 45 మున్సిపాలిటీలలో చెత్త నిర్వహణ కేంద్రాలు నడుస్తున్నాయని, కొన్నిచోట్ల బయోడీజిల్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ఇక్కడి కేంద్రానికి ఆ అర్హత ఉన్నా ప్లాంటుకు కావాల్సిన వ్యర్థాలు ఆ స్థాయిలో అందుబాటులో లేకపోవడంతో బయోడీజిల్ ప్లాంటు ఏర్పాటులో ఆలస్యం అవుతున్నట్లు జేడీ పేర్కొన్నారు. అనంతరం ఇదే ఆవరణంలోని శునకాల కుటుంబ నియంత్రణ కేంద్రాన్ని పరిశీలించి, అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటసుబ్బయ్య, మేస్త్రీలు రెడ్డెప్ప, మస్తాన్, తదితరులు ఉన్నారు.



ఎరువుల తయారీపై సూచనలు ఇస్తున్న స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ జేడీ భాగ్యలక్ష్మి, కమిషనర్ ప్రమీల

ఎర్రచందనం రవాణాలో పెద్దల హస్తం

● డీఎఫ్‌వో వినీత్‌కుమార్

ఒంటిమిట్ట, మే 3 (ఆంధ్రజ్యోతి) : ఎర్రచందనం అక్రమ రవాణాలో పెద్దల హస్తం ఉన్నట్లు తెలుస్తోందని కడప డీఎఫ్‌వో వినీత్ కుమార్ తెలిపారు. శనివారం స్థానిక అటవీ శాఖ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శుక్రవారం పట్టుబడిన ఎర్రచందనం దుంగల స్మగ్లింగ్‌లో 7 నుంచి 8 మంది వ్యక్తుల ప్రమేయం ఉంటుందని, దొరికిన సెల్‌ఫోన్లకు కాల్స్ వస్తున్నాయని, ఇందులో బెంగళూరు, మదనపల్లె ప్రాంతాలకు చెందిన పెద్దల హస్తం ఉండవచ్చునన్నారు. శుక్రవారం తెల్లవారుజామున ఒంటిమిట్ట చెరువు కట్టపై అనుమానాస్పదంగా క్యాబేజీ లోడుతో వెళుతున్న ఐచర్ వాహనాన్ని వెంటాడి ఫారెస్ట్ చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. ఇందులోని ఇద్దరు వ్యక్తులు పరారయ్యారని, రెండు సెల్‌ఫోన్లు, 84 దుంగలు, ఐచర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. సెల్‌ఫోన్ ఆధారంగా అన్నమయ్య జిల్లా రేగల్లు మండలం బోయనపల్లె గ్రామానికి చెందిన మురళిని గుర్తించామన్నారు. అతడి కోసం ప్రత్యేక టీములను మదనపల్లె, పీలేరు ప్రాంతాలకు పంపామన్నారు. కార్యక్రమంలో సబ్ డీఎఫ్‌వో వివేకానంద, డీఆర్వో నాగునాయక్, సిబ్బంది శ్రీనివాసులు, సుబ్రమణ్యం, సుధాకర్, ఇందిర, ఆంజనేయులు, నాయక్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



దుంగలను పరిశీలిస్తున్న డీఎఫ్‌వో

ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించాలి

● కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), మే 3 (ఆంధ్రజ్యోతి): మండలాల్లో ప్రభుత్వ భూములకు తగిన విధంగా రక్షణ కల్పించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సబ్ కలెక్టర్లు, ఆర్డీవో, తహసీల్దార్లతో రెవెన్యూ అంశాలపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పథకాలకు భూములు అవసరం అవుతాయని, మండలంలో ప్రభుత్వ భూములను గుర్తించి వాటికి తగిన రక్షణ కల్పించాలన్నారు. ఈ అంశంలో మండలాల వారీగా సమీక్షించి తగు సూచనలు జారీ చేశారు. అలాగే ల్యాండ్ రెగ్యులరైజేషన్ పథకం 2025లో భాగంగా ప్రభుత్వం నూతనంగా జారీ చేసిన మార్గదర్శకాల మేరకు 2019 అక్టోబరు 15కు ముందు ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని ఏర్పరచుకున్న నివాస గృహాల్లో అభ్యంతరం లేని వాటి క్రమబద్ధీకరణ అంశంలో గుర్తించిన యూనిట్లు, తీసుకున్న చర్యలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. అలాగే హౌసింగ్ రీవెరిఫికేషన్ పెండింగ్ కూడా త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రతి మండలంలో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు సాధ్యాలపై కూడా వెంటనే నివేదికను పంపాలని సూచించారు. జిల్లాలో పచ్చిమేత పెంపకానికి డివిజన్, మండల స్థాయిలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ, డీకేటీ, ప్రైవేటు భూములను ప్రతి మండలంలో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు తీసుకోవాల్సిన చర్యలపై కూడా వెంటనే నివేదికను పంపాలని సూచించారు. వివిధ పర్యాటక ప్రాజెక్టులకు సంబంధించి దోబీఘాట్ల ఏర్పాటుకు అవసరమైన భూముల ప్రతిపాదనలు కూడా వెంటనే సమర్పించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్‌వో మధుసూదన్ రావు, సబ్ కలెక్టర్లు మేఘస్వరూప్, నైదియాదేవి, ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

టమోటా ధరలు మరింత పతనం

ములకలచెరువు, మే 3 (ఆంధ్రజ్యోతి): టమోటా ధరలు మరింత పతనమయ్యాయి. భారీగా తగ్గి నిన్నటి వరకు బాక్సు రూ.200 వరకు పలికిన ధర శనివారం రూ.వందలోపే పలికాయి. ములకలచెరువు మార్కెట్‌కు భారీగా టమోటాలు అమ్మకానికి వచ్చాయి. 22 కేజీల బాక్సు నాణ్యతను బట్టి కేవలం రూ.70 నుంచి రూ.వంద వరకు మాత్రమే పలికాయి. ఒకే ఒక్క లాటు మాత్రం రూ.120 పలికాయి. మిగిలిన కాయలు మాత్రం రూ.వందలోపే పలకడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. రెండు రోజుల క్రితం వరకు రూ.200 వరకు పలికిన ధరలు మరింత కుప్పకూలీ సగానికి పడిపోయాయి. టమోటాలను మార్కెట్‌కు తీసుకొస్తే కూలీల ఖర్చు కూడా రాలేదని రైతులు వాపోయారు. ఈ ప్రాంతంలో టమోటా సాగు పెరిగి దిగుబడి అధికంగా వస్తుండడంతో మార్కెట్‌కు కాయలు భారీగా వస్తున్నాయి. ప్రస్తుతం ఇక్కడి నుంచి కాయలు మన రాష్ట్రంలోని పలు పట్టణాలు, నగరాలు, తమిళనాడు రాష్ట్రానికి ఎగుమతి అవుతున్నాయి. అలాగే కొన్ని కోల్‌కతాకు వెళుతున్నాయి.



ములకలచెరువు మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన టమోటాలు

ప్రతి రైతుకు అండగా ఉంటాం

● టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు

సిద్దవటం, మే 3 (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షాలు, ఈదురుగాలుల వల్ల దెబ్బతిన్న ప్రతి రైతుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున నష్టపరిహారం చెల్లిస్తామని, ప్రతి రైతుకు అండగా ఉంటామని ఎవరూ ఆందోళన చెందవద్దని టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. మండలంలోని భాకరాపేట గ్రామంలో ఈదురు గాలులు, అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న అరటి తోటలను జగన్‌మోహన్‌రాజు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎప్పుడూ రైతులకు అండగా ఉంటుందని, దెబ్బతిన్న అరటి పంటలను అధికారులు పరిశీలించి త్వరగా నివేదికలు పంపాలని ఆయన అధికారులకు తెలిపారు. ఏ ఒక్క రైతుకు కూడా నష్టం రాలేదనే మాట కూడా రాకుండా జాగ్రత్త వహించి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. రైతుల పంట పొలాల్లో దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలకు త్వరగా మరమ్మతులు చేసి నాణ్యమైన విద్యుత్ అందించాలని అధికారులకు తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో ఉద్దిమడుగు ప్రాజెక్టు కింద మునక ప్రాంతం కింద కొంతమంది పంట పొలాలకు నష్టపరిహారం కింద తీసుకున్న డబ్బుల్లో భారీగా అవినీతి జరిగిందని, నష్టపరిహారం తీసుకున్న వైసీపీ బడా నేతలు కొంతమంది నిరుపేద కుటుంబాల రైతుల పేర్లు రెవెన్యూ రికార్డుల్లో ఆన్‌లైన్‌లో చూపించి వారికి అన్యాయం చేశారని ఆయన మండిపడ్డారు. ఉద్దిమడుగు ప్రాజెక్టులో చేసిన అవినీతిని త్వరలో బయట పెడతామని, అవినీతి చేసిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని, నిజమైన రైతులకు న్యాయం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ హరిసేవ్యానాయక్, అగ్రికల్చర్ ఏవో రమేష్‌రెడ్డి, రాష్ట్ర బీసీసెల్ కార్యనిర్వహణ కార్యదర్శి శ్రీనివాసులునాయుడు, టీడీపీ నాయకులు మోహన్‌రెడ్డి, దశరథనాయుడు, సర్పంచ్ తుర్రా ప్రతాప్‌నాయుడు, ఉపసర్పంచ్ నరసింహారెడ్డి, టీడీపీ నేత పుత్తా బాబు తదితరులు పాల్గొన్నారు.



దెబ్బతిన్న అరటి తోటను పరిశీలిస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు, టీడీపీ నేతలు

విద్యుత్ శాఖకు రూ.30 లక్షలు నష్టం

● ఏపీఎస్పీడీసీఎల్ కడప ఈఈ హరిసేవ్యానాయక్

సిద్దవటం మండలంలో ఇటీవల గాలులు, అకాల వర్షంతో విద్యుత్ శాఖకు దాదాపు రూ.30 లక్షల మేర నష్టం వాటిల్లిందని ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ హరిసేవ్యానాయక్ తెలిపారు. మండలంలోని బొగ్గిడివారిపల్లెలో శనివారం ఆయన విద్యుత్ మరమ్మతు పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యం వల్ల కేవలం గంట వ్యవధిలో పెద్ద పెద్ద వృక్షాలు విద్యులైన్లపై పడడం వల్ల వంద విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయన్నారు. పది ట్రాన్స్‌ఫార్మర్‌లు కాలిపోయాయన్నారు. నాలుగు కిలోమీటర్ల మేర విద్యుత్ లైను దెబ్బతిందన్నారు. ఈ మేరకు దాదాపు 30 లక్షల మేర విద్యుత్‌శాఖకు నష్టం వాటిల్లిందన్నారు. గృహ వినియోగదారులకు, వ్యవసాయానికి విద్యుత్ సరఫరాను చేసేందుకు సిబ్బంది అవిశ్రాంతంగా పనిచేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఒంటిమిట్ట డీఈ సుబ్రమణ్యం, సిద్దవటం, ఒంటిమిట్ట ఏఈలు జయచంద్ర, ఉదయ్‌కుమార్‌రెడ్డి, కడప, సిద్దవటం, ఒంటిమిట్ట కాంట్రాక్టర్లు సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

● తిరుచ్చిపై ఉత్సవమూర్తుల నగరోత్సవం

వాల్మీకిపురం, మే 3 (ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణంలోని పట్టాభిరామాలయంలో శనివారం టీటీడీ ఆధ్వర్యంలో పునర్వసు సీతారాముల కల్యాణోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, ఆలయంలోని మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవలతో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం నూతన వధూవరులైన సీతారాములకు ప్రత్యేక అలంకరణలు చేసి మామిడి తోరణాలు, పుష్పాలంకరణలతో ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపై ఆశీనులను చేశారు. మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చారణలు, విశేష భక్తుల నడుమ సీతారాముల కల్యాణం కమనీయంగా సాగింది. అనంతరం హోమాది కార్యక్రమాలు, పూర్ణాహుతి నిర్వహించారు. సాయంత్రం తిరుచ్చిపై సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాములను విశేషాలంకరణలు చేసి పురవీధులలో నగరోత్సవం నిర్వహించారు. వేడుకలలో పాల్గొన్న దంపతులకు, భక్తులకు టీటీడీ వస్త్రం, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాలలో ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, అర్చకులు ధనుష్, భాషికాచార్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



తిరుచ్చిపై సీతారామ లక్ష్మణుల నగరోత్సవం

ప్రజల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం: మంత్రి



రామాపురం: ప్రజాదర్బార్ నిర్వహిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రామాపురం, మే3(ఆంధ్రజ్యోతి): ప్రజల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం రామాపురం మండలం ఆర్ అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో మంత్రి ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ప్రజల సమస్యల పరిష్కారానికి నోచుకోక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనే వారని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన ప్రజా క్షేమమే ధ్యేయంగా అధికారులు, ప్రజాప్రతినిధులు పనిచేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా మంత్రి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను స్వీకరించి వాటిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మహాభారతంలో పాల్గొన్న మంత్రి

రామాపురం, మే3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి శనివారం రామాపురం మండలంలో జరుగుతున్న మహాభారతంలో పాల్గొని కొబ్బరికాయకొట్టి ద్రౌపతి, కృష్ణుడు, పాండవులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రామాపురంలో జరుగుతున్న మహాభారతానికి రాష్ట్రం నలుమూలల నుంచి ప్రజలు విశేష సంఖ్యలో హాజరుకావడం జరిగిందని భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు ఏర్పాటు చేయాలని మహాభారతం కమిటీ సభ్యులకు సూచించారు. ముఖ్యంగా ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని మహిళలు, వృద్ధులు, చిన్నారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజలకు మంచినీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు సూచించారు.పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో షష్ఠి పూజలు



ప్రత్యేక అలంకరణలో సుబ్రమణ్యం స్వామి

నందలూరు, మే 3 (ఆంధ్రజ్యోతి) : నందలూరు రైల్వే కేంద్రంలోని వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో వెలసిన సుబ్రమణ్యేశ్వరస్వామికి శనివారం షష్ఠి సందర్భంగా ఆలయ అర్చకులు సరసా రవికుమార్‌శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. భక్తులు స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో గండికోట చిన్న సుబ్బరాయుడు, శ్రీనివాసులు, కొట్టే శ్రీహరి, గంగాదేవి, సులోచన, నాగలక్ష్మి, ధనమ్మ సాయిచేతన్ తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్లతో తాగునీటి వసతి

సిద్దవటం, మే 3 (ఆంధ్రజ్యోతి) : నేకనాపురం గ్రామంలో గ్రామ సర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచితంగా గ్రామ ప్రజలకు ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందిస్తున్నారు. నేకనాపురంలో మూడు రోజులుగా వర్షాల కారణంగా విద్యుత్ అంతరాయం కలగడంతో నీటిఎద్దడి ఏర్పడింది. సర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం తాగునీరు అందిస్తున్నారు.

పోలీసులకు ఫిర్యాదు

గాలివీడు, మే3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పోలీస్ వెల్ఫేర్ పెట్రోల్ బంకులో పనిచేసే మేనేజర్, సిబ్బంది వినియోగదారుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు టీడీపీ మండల నాయకుడు గోరాన్‌చెరువు గ్రామ మాజీ ఎంపీటీసీ రెడ్డిప్రసాద్‌రెడ్డి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంకుల్లో పెట్రోల్ లేదా డీజిల్ పోయించుకునే క్రమంలో పెట్రోల్ బంక్ మేనేజర్, సిబ్బంది వినియోగదారులతో అసభ్యంగా మాట్లాడుతున్నారన్నారు. వారి ప్రవర్తన దారుణంగా ఉందని తెలిపారు. ఇక్కడ మేనేజర్ 7 సంవత్సరాలుగా ఇక్కడే తిష్ట వేశారని, సంబంధిత అధికారులు ఇతనిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆంధ్రుల కలల రాజధాని అమరావతి సిద్ధమవుతోంది

● **టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా**

రాయచోటిటౌన్, మే3(ఆంధ్రజ్యోతి): నాడు వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టిస్తే నేడు ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో ఆంధ్రుల కలల రాజధాని అమరావతి అద్భుతంగా సిద్ధమవుతోందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కుప్పం నియోజకవర్గ పరిశీలకుడు గాజుల ఖాదర్‌బాషా అన్నారు. శనివారం ఆయన పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ హయాంలో మూడు రాజధానుల పేరుతో అమరావతిని విచ్ఛిన్నం చేసే ప్రయత్నం చేసి కేవలం 11 సీట్లకే పరిమితమయ్యారని గుర్తు చేశారు. శుక్రవారం రూ.54 వేల కోట్లతో ప్రారంభించిన పనులు వైసీపీ నాయకులకు కనపడలేదా అన్నారు. 2047 నాటికి మన రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా చేయాలన్నదే చంద్రబాబు లక్ష్యమన్నారు. అమరావతితో మన రాష్ట్రానికి పెట్టుబడులు హోరువస్తుందని, వచ్చే మూడేళ్లలో ప్రజలకు ఫలాలు అందుతాయన్నారు. మాజీ సర్పంచ్ నాగేశ్వర్‌నాయుడు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి మట్లి శ్రీనివాసులునాయుడు, నాయకులు మురళీ, జయరాంరెడ్డి, శివారెడ్డి, బసిరెడ్డి, బాషాహైదర్, రోషా పాల్గొన్నారు.

ప్రాజెక్టు కూల్చేసింది మీరే.. విమర్శించేది మీరేనా : చమర్తి



మాట్లాడుతున్న పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాజంపేట టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి) : అన్నమయ్య ప్రాజెక్టు మీ స్వార్థ ప్రయోజనాల కోసం ఆనాడు మీ ప్రభుత్వంలోనే కూల్చింది మీ నేతలే. నేడు విమర్శించేది మీరేనా అని టీడీపీ పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్‌రాజు విమర్శించారు. శనివారం పట్టణంలోని ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అన్నమయ్య ప్రాజెక్టుపై విమర్శలు చేయడం సరికాదన్నారు. వైసీపీ ప్రభుత్వంలో అన్నమయ్య ప్రాజెక్టు ఎలాంటి మెయింటినెన్స్ చేయకపోవడం వల్ల, ఇసుక తవ్వకాల వల్ల ప్రాజెక్టు గేట్లు ఎత్తకపోవడం వల్ల ప్రాజెక్టు కొట్టుకుపోయిందన్నారు. ఆనాటి నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టుకు టెండర్లు పిలవకూడదు పిడికెడు మట్టి కూడా వేయని మీరు కూటమి ప్రభుత్వాన్ని విమర్శిస్తారా అని ఆయన దుయ్యబట్టారు. ఆనాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆ ప్రాంతవాసులకు పక్కా ఇళ్లు కడతామని, ప్రాజెక్టును త్వరగా పూర్తి చేస్తామని మాటలు చెప్పి మడమ తిప్పిన నేత జగన్‌రెడ్డి కాదా అన్నారు. మీ స్వార్థ ప్రయోజనాల కోసం ఇళ్లు, ఆస్తులు, పొలాలు, జంతుజలం, ఎంతోమంది మృత్యువాత పడ్డారన్నారు. ఆ ప్రాంతంలో ఏ ఒక్కరికి సరైన వసతులు ఇవ్వకపోవడంతో ప్రజలు తోచిన సహాయంతో వారికి తాత్కాలికంగా గృహాలు ఏర్పాటు చేశారని, ఇప్పటికీ వాటిల్లోనే ఉన్నారన్నారు. ఇన్నిరోజులు మీ ప్రభుత్వం ఉన్నా ఏమీ చేయకపోవగా కూటమి ప్రభుత్వంపై బురద జల్లడం సరికాదన్నారు. అన్నమయ్య ప్రాజెక్టు నిర్మాణం పనులు మా ప్రభుత్వంలోనే పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. టీడీపీ నేతలు గన్నే సుబ్బనరసయ్య, కొల్లు రెడ్డయ్య, మదనపల్లె శ్రీను, ప్రవీణ్, శివనారాయణ, సిద్దిక్ తదితరులు పాల్గొన్నారు.

'పోరాటాలకు యువత సిద్ధం కావాలి'

రైల్వేకోడూరు, మే 3(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులను మోసం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై యవత పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు దార్ల రాజశేఖర్ తెలిపారు. శనివారం రైల్వేకోడూరు సీపీఐ కార్యాలయం వద్ద ఏఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి 18 వరకు తిరుపతి నగరంలో నిర్వహించనున్న ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు తుమ్మల రాధాక్రిష్ణయ్య, రైల్వేకోడూరు నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, నాయకులు శెట్టిపల్లె పెంచలయ్య, పాలతోటి విజయ్‌కుమార్, మొగిలి వినయ్, సాయి, భానుప్రకాష్ పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయ నిర్మాణానికి చండీ హోమం



రైల్వేకోడూరు, మే 3(ఆంధ్రజ్యోతి): కన్యకాపరమేశ్వరి నూతన ఆలయ నిర్మాణానికి శనివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో చండీహోమం నిర్వహించినట్లు ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు గునిశెట్టి రమేష్, ఆలయ పునర్నిర్మాణ కమిటీ అధ్యక్షుడు కామిశెట్టి పార్థసారథి తెలిపారు. ఆలయ అర్చకుడు శరవణస్వామి ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఈ నెల 8న నూతన ఆలయానికి భూమిపూజ చేస్తామన్నారు. ఆదివారం 108 జంటలతో నక్షత్ర హోమం చేస్తామన్నారు.

'కార్యకర్తలకు అండగా ఉంటాం'



నివాళులర్పిస్తున్న ముక్కావరలక్ష్మి

ఓబులవారిపల్లె, మే 3 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కార్యకర్తలకు అండగా ఉంటామని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మీ తెలిపారు. శనివారం బొమ్మవరం గ్రామానికి చెందిన ఉమ్మలరాజు కేశవరాజు (90) శుక్రవారం వడదెబ్బతో మృతిచెందడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. వారి కుమారులు, బీజేపీ ఇన్‌చార్జి గడ్డం చెంగల్‌రాజు, టీడీపీ సీనియర్ నాయకులు ఉమ్మలరాజు పిచ్చిరాజు, ఉమ్మలరాజు సుబ్బరాజు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సంపాదిత సెలవులు మంజూరు చేయాలి



మాట్లాడుతున్న కొండూరు శ్రీనివాసరాజు

రాయచోటిటౌన్, మే3(ఆంధ్రజ్యోతి): పదవ తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు బోధించే ఉపాధ్యాయులకు సంపాదిత సెలవులు మంజూరు చేయాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక డైట్ విద్యా కేంద్రంలో ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్రత దృష్ట్యా ప్రత్యేక తరగతులను మధ్యాహ్నం వరకు మాత్రమే పరిమితం చేయాలన్నారు. ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్స్, మజ్జిగ అందుబాటులో ఉండే విధంగా పాఠశాల విద్యాశాఖ చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టీఏ నేతలు లక్ష్మీరమణయ్య, తౌఫిక్, బాలాజీ, షఫీ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తీర్చాలంటూ ఎంపీపీకి ఫిర్యాదు

వీరబల్లి, మే3(ఆంధ్రజ్యోతి): తమకు తాగునీటి సమస్య తీర్చాలంటూ వంగిమళ్ల పంచాయతీ పోలు చెన్నారెడ్డిగారికి చెందిన గ్రామస్తులు శనివారం ఎంపీపీ రాజేంద్రనాథ్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. తమ గ్రామంలో ఒక నెల కిందట నుంచి తాగునీటి సమస్య అధికంగా ఉందని, తాగునీటి కోసం నానా అవస్థలు పడుతున్నామని ఫిర్యాదులో పేర్కొన్నారు. మాండవ్యనది ఒడ్డున ఉన్న తమ గ్రామానికి ఇంతకు ముందు ఎప్పుడు ఇలాంటి సమస్య రాలేదన్నారు. మాండవ్యనది ఒడ్డున ఉన్న తమ గ్రామానికి ఇంతకు ముందు ఎప్పుడు ఇలాంటి సమస్య రాలేదన్నారు. మాండవ్యనది నుంచి రాంత్రిబవళ్లు ఇసుక అధికంగా తరలివెళ్లడంతో నటి శాతం తగ్గి బోర్లలో నీరు నాలేదన్నారు. కనీసం ట్యాంకర్ల ద్వారానైనా తమ గ్రామానికి తాగునీరు అందించాలని కోరుతున్నారు

కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు పార్టీ అండ



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న గన్నే సుబ్బనరసయ్య

రాజంపేట, మే 3 (ఆంధ్రజ్యోతి) : పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు టీడీపీ పార్టీ అండగా ఉంటుందని రాజంపేట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గన్నే సుబ్బనరసయ్య పేర్కొన్నారు. మండలంలోని ఆకేపాడు ప్రాంతంలో అవకాశవాదులు పెత్తనం చెలాయిస్తున్నారని, కష్టకాలంలో పార్టీకి అండగా నిలబడిన తమను గుర్తించాలని కార్యకర్తలు సుబ్బనరసయ్యకు తెలియజేశారు. ఈ సందర్భంగా తన కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్ ఇచ్చిన ఆదేశాల మేరకు పార్టీ సీనియర్ కార్యకర్తలకే ప్రాధాన్యత తప్ప అవకాశవాదులకు కాదని అన్నారు. కష్టకాలంలో పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు ప్రా ధాన్యం ఇస్తున్నామన్నారు. తమ సమస్యల పరిష్కారానికి అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడితే చర్యలు తప్పవు

● **మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు**

రాజంపేట టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట పట్టణంలో నివశిస్తున్న ప్రజలు, వ్యాపారులు ప్లాస్టిక్ వాడితే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం మున్సిపాలిటీలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి పరిసరాలను పరిశీలించారు. అనంతరం పట్టణంలోని పలు హోటళ్లను తనిఖీ చేసి పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించి వ్యాపారులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిలిపివేయాలని, ప్లాస్టిక్ వాడకం వల్ల పరిసరాలకే కాకుండా ఆరోగ్యానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందం ఉందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

ప్రమాద బాధితురాలికి పరామర్శ

ఓబులవారిపల్లె, మే 3 (ఆంధ్రజ్యోతి) :ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన అమరావతి పునఃప్రారంభం కార్యక్రమానికి హాజరై తిరుగు ప్రయాణంలో ప్రమాదానికి గురైన గోవిందంపల్లె పంచాయతీ కడియాలపల్లెకు చెందిన గీతాను ఎంపీడీవో మల్‌రెడ్డి, అధికారులు పరామర్శించారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.2 వేలు అందజేశారు.

సమస్యల పరిష్కారం కోసం గ్రామాల్లో పర్యటన

సిద్దవటం, మే 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దపల్లి గ్రామ పంచాయతి మలినేని పట్నం గ్రామంలో శనివారం ప్రజల సమస్యల పరిష్కారం కోసం మండల అభివృద్ధి అధికారి ఫణిరాజకుమారి పర్యటించారు. ఆమె మాట్లాడుతూ ప్రజల సమస్యలపై క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మలినేనిపట్నంలో ప్రజల సమస్యల పరిష్కారం కోసం పర్యటిస్తున్నామని, విద్యుత్, నీటి సమస్య, రాష్ట్ర ప్రభుత్వం అందించే పథకాలు, పెన్షన్ వంటి కార్యక్రమాలపై ప్రజలను అడిగి వివరాలు సేకరించామని ఆమె అన్నారు. గ్రామాల ప్రజలు ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, వెంటనే వాటికి పరిష్కారం చూపిస్తామని తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఈ సందర్భంగా ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజేష్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కార్మికులకు ప్రభుత్వం అండగా ఉండాలి

ఓబులవారిపల్లె, మే 3 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ కార్మికులకు ప్రభుత్వం అండగా ఉండాలని బీకేఎంయూ నియోజకవర్గ కార్యదర్శి జయరామయ్య డిమాండ్ చేశారు. శనివారం బొమ్మవరం గ్రామ పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను వారు పరిశీలించారు. వేసవి కాలంలో తాగునీరు, నీడ, వేసవి తాపానికి మజ్జిగ వంటి సౌకర్యాలను కల్పిస్తూ కనీస వేతనంగా సుమారు రూ.600 కల్పించాలన్నారు.

నవ్యాంధ్ర నూతన రాజధాని నిర్మాణ బాధ్యత కేంద్రానిదే: కాంగ్రెస్

రాయచోటిటౌన్, మే3(ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర నూతన రాజధాని నిర్మాణ బాధ్యత పూర్తిగా కేంద్రానిదేనని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గాజుల భాస్కర్ అన్నారు. శనివారం ఆయన రాయచోటి పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ విభజన చట్టం ప్రకారం రాజధాని నిర్మాణం కేంద్రమే చేపట్టాల్సి ఉండగా ప్రధాని మోదీ రూ.50 వేల కోట్లు అప్పు ఇప్పిస్తానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 2015లో మట్టి కొట్టారని, నేడు సున్నం కొట్టి వెళ్లారని ఎద్దేవా చేశారు. విభజన హామీలపై టైమ్ బాండ్ క్లారిటీ ఇచ్చారా అనే విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మన్సూర్ అలీఖాన్, ఉపాధ్యక్షుడు ఖదీర్, దర్బార్‌బాషా, చెన్నక్రిష్ణ, పట్టణ అధ్యక్షుడు బాబా సర్దార్ పాల్గొన్నారు.

రైతులకు వ్యవసాయ కిట్లు పంపిణీ



పీఎండీఎస్ పద్ధతిలో విత్తనాలు సిద్ధం చేస్తున్న రైతులు

చిన్నమండెం, మే3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రీ-మన్సూన్ డ్రై సోయింగ్ (పీఎండీఎస్) పథకాన్ని అమలు చేస్తూ 30 రకాల విత్తనాలతో 10 మంది రైతులకు వ్యవసాయ కిట్లను ప్రకృతి వ్యసాయ సిబ్బంది పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంటీ శ్రీనివాస్ హాజరై పథకం ప్రయోజనాలను రైతులకు వివరించారు. పీఎండీఎస్ ద్వారా వర్షాకాలం ప్రారంభానికి ముందే సాగు ప్రారంభించడం వల్ల మట్టిలో తేమ నిలిచి, సూక్ష్మజీవుల చురుకుదనంతో పాటు పోషకాల శక్తి పెరుగుతుందన్నారు. ఐసీఆర్‌పీ స్వామి, రాజేశ్వరి, నాగలక్ష్మి, కవిత, హెచ్‌ఎస్‌ఎఫ్ పావనిలు పాల్గొన్నారు.

మెడికల్ షాపుల యజమానులతో పోలీసుల సమావేశం



మాట్లాడుతున్న అర్బన్ సీఐ వెంకటాచలపతి

రాయచోటిటౌన్, మే3(ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని మెడికల్ షాపు యజమానులతో శనివారం రాయచోటి అర్బన్ సీఐ బీ. వెంకటచలపతి సమావేశం నిర్వహించారు. పట్టణంలో యువత ట్యాబెట్ల రూపంలో మత్తుకు బానిసౌతున్నారని, డాక్టర్ రసీదు లేనిదే నిషేధిత మందులను అమ్మరాదని తెలియజేశారు. లేకుంటే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ప్రధాన రహదారిపై పారిశుధ్యం మెరుగు

సిద్దవటం, మే 3 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన రహదారి సిద్దవటం, దిగువపేటలో, సిద్దవటం - బద్వేల్ రహదారి పక్కన ఉన్న అపరిశుభ్రతను పూర్తిగా తొలగించినట్లు మండల విస్తరణాధికారి మెహతాజ్ యాస్మిన్ తెలిపారు. గ్రామ సర్పంచ్ భావనాసి నాగరాణి అధ్యక్షతన మురికినీటిని పూర్తిగా తొలగించామన్నారు. బ్లీచింగ్ పిచికారీ చేశామన్నారు. ఇన్‌చార్జి పంచాయతి సెక్రటరి రాజేష్ పాల్గొన్నారు.

నీటి సమస్యకు పరిష్కారం చూపండి

రాయచోటిటౌన్, మే3(ఆంధ్రజ్యోతి): రాయచోటి మండల పరిధిలోని గొర్లముదివేడు దళితవాడలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని మంత్రి మండిపల్లి అధికారులకు ఫోన్‌లో ఆదేశించారు. ఎక్కడైనా నీటి సమస్య ఉంటే వెంటనే తమకు తెలియజేసి పరిష్కరించుకోవచ్చునన్నారు. నీటి సమస్య చోటల్లా బోర్లు వేస్తున్నామన్నారు.

క్రికెట్ క్యాంపును వినియోగించుకోవాలి

నందలూరు, మే 3 (ఆంధ్రజ్యోతి) : నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతి అరవపల్లెలోని క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్రికెట్ క్యాంపును అందరూ వినియోగించుకోవాలని సీఏవైడీ క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్‌ఆర్ డిస్ట్రిక్‌కు చెందిన సీడీవో ఖాజామొహిద్దీన్, బీసీసీఐ వీడియో ఎనాలసిస్ట్ రెహమాన్‌లు పేర్కొన్నారు.

శనివారం వారు మాట్లాడుతూ సబ్‌సెంటర్‌లోని కోచ్‌లు చెప్పిన విధంగా మెళుకువలు నేర్చుకుని భవిష్యత్‌లో రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయికి ఎదగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నందలూరు సబ్‌సెంటర్ హెడ్‌కోచ్ గయాజ్, అసిస్టెంట్ కోచ్ ఫిరోజ్‌ఖాన్‌లోడి, ట్రైనర్ శివకోటి, గ్రౌండ్స్ మెన్ హరిక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

ఒంటిమిట్ట, మే 3 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్ట మండలంలోని మండపంపల్లె గ్రామ సచివాలయాన్ని శనివారం ఎంపీడీవో కుళాయిబాబు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై సర్వే త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతి కార్యదర్శి శివకుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు సింగనమలకు విశ్వనాథనాయుడు రాక

పెనగలూరు, మే 3 (ఆంధ్రజ్యోతి) : పెనగలూరు మండలంలోని పాత సింగనమల గ్రామంలో ఆదివారం జరుగుతున్న యల్లమ్మ జాతర కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కస్తూరి విశ్వనాథనాయుడు పాల్గొనున్నారని ఆయన సన్నిహితులు తెలిపారు. జాతర కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు జయప్రదం చేయాలని వారు కోరారు.

గాలివాన బీభత్సం

● పడిపోయిన స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ● తడిసిన పంట దిగుబడులు



ఎంకుపల్లె పొలంలో పడిపోయిన విద్యుత్ స్తంభం, ట్రాన్స్‌ఫార్మర్

దువ్వూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): ప్రశాంతంగా ఉన్న ప్రకృతి ఒక్కసారిగా విజృంభించింది. శుక్రవారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. పొలాల్లో విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు కింద పడ్డాయి. పసుపు, నువ్వులు, మొక్కజొన్న, వేరుశనగ పంటలు ఆరబెట్టగా అవి తడిసిపోయాయి. సుమారు గంటపాటు గాలివాన ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేసింది. పలుచోట్ల రేకుల షెడ్డులు విరిగిపడ్డాయి. మండల వ్యాప్తంగా ఆరు చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు పడిపోయాయని, 35 కరెంటు స్తంభాలు కిందపడ్డాయని, అర్ధ కిలోమీటరు మేరకు విద్యుత్తు వైర్లు తెగిపడ్డాయని ఏఈ నరేంద్రారెడ్డి తెలిపారు. సుమారు రూ.10 లక్షల మేరకు నష్టం వాటిల్లినట్లు వ్యక్తమవుతోంది. వ్యవసాయ శాఖకు సంబంధించి మైదుకూరు ఏడీఏ కృష్ణమూర్తిని సంప్రదించగా పంట నష్టం జరిగినట్లు మండలాల నుంచి ఎటువంటి ఫిర్యాదులు లేవన్నారు.



జమ్మలమడుగులో విరిగిన విద్యుత్తు స్తంభం.. తెగిన తీగెలు

నేలకొరిగిన మామిడి చెట్లు

పోరుమామిళ్ల, మే 3(ఆంధ్రజ్యోతి): గాలివాన బీభత్సానికి రంగసముద్రం పంచాయతీ పరిధిలోని గాయకవాడ సుబ్బారావుకు చెందిన మామిడి తోటలో దాదాపు నాలుగు టన్నుల మామిడికాయలు నేలరాలాయి. 13 చెట్లకు పైగా నేలకొరిగాయి. కాపు చేతికి వచ్చి ఉండింటే టన్ను రూ.70వేలు ధర పలికేదని, ఈ అకాల వర్షం కారణంగా కనీసం రూ.10వేలు కూడా పలికే పరిస్థితి లేదని రైతు వాపోయారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై ఉద్యానశాఖ అధికారి శ్రీనివాసులరెడ్డిని వివరణ కోరగా తమ సిబ్బందిని పంపి నష్టం అంచనా వేస్తామన్నారు.



రూ.15లక్షలు మేర నష్టం

చెన్నూరు, మే 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో గురు, శుక్రవారాల్లో వీచిన ఈదురు గాలులకు కొండపేట, రామనపల్లె, గోపవరం, ఓబులం పల్లె, ఆలంఖాన్‌పల్లె గ్రామాల్లోని బయటి ప్రాంతాల్లో దాదాపు 20 విద్యుత్‌స్తంభాలు నేలకొరిగాయి. పూర్తిగా పలుచోట్ల విద్యుత్‌స్తంభాలు నెర్ర ఉబారాయి. దీంతో విద్యుత్‌తీగలు సైతం తెగి నేలపై పడ్డాయి. సుమారుగా రూ.15లక్షల మేర నష్టం వాటిల్లినట్లు ట్రాన్స్‌కో ఈఈ రామలింగారెడ్డి తెలిపారు. అలాగే 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు 8, ఆరు సింగిల్‌ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు, ఐదు 16కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు సైతం దెబ్బతిన్నాయని, వీటిలో సాగునీటి అవసరాలకు ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను రేయింబవళ్లు పనిచేసి తెల్లారేసరికి సిబ్బంది బాగు చేయడం, కొత్తవి తెచ్చి పెట్టడం జరిగిందని తెలిపారు.

విరిగిపడిన స్తంభాలు

జమ్మలమడుగు, మే 3 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో శుక్రవారం రాత్రి ఈదురు గాలులు వీచాయి. దీంతో పట్టణంలోని పలు ప్రాంతాల్లో, గ్రామాల్లో చెట్లు, కొమ్మలు విరిగిపడ్డాయి. పెద్ద పసుపుల మోటులోని తేరురోడ్డు ఎదురుగా కరెంటు స్తంభాలు విరిగిపడ్డాయి. అలాగే విద్యుత్తు తీగెలు రోడ్డుపొడవునా పడ్డాయి. అనేక చోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. దీంతో పలు ప్రాంతాల్లో విద్యుత్తు అంతరాయం కలిగింది. ప్రజలు అంధకారంలో దోమలతో కొంత ఇబ్బందులు పడ్డారు.

క్రమశిక్షణ, నైతిక విలువలు కలిగి ఉండాలి

● జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ షంషుద్దీన్



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న డీఈవో షంషుద్దీన్

బద్వేలు రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, దేశభక్తి, సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాలని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ షంషుద్దీన్ అన్నారు. శనివారం స్థానిక బిజివేముల వీరారెడ్డి డిగ్రీ కాలేజీ ఆవరణలోని ఇండోర్ ఆడిటోరియంలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) ఆధ్వర్యంలో ఇటీవల పది పరీక్ష ఫలితాల్లో బద్వేలు, గోపవరం మండలాల్లోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదివి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచిపేరు తీసుకురావాలని, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. అనంతరం అధిక మార్కులు సాధించిన సుమారు 30 మంది విద్యార్థులకు నగదు, మెమెంటో, ప్రశంసాపత్రం అందించారు. కార్యక్రమంలో ఉప విద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి, ఆపస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామాంజనేయ ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, జిల్లా అధ్యక్షుడు ఎస్.చెన్నయ్య, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి, ఎంఈవో సునీల్‌కుమార్, ఆపస్ నాయకులు అంకయ్య, వెంకట్రామిరెడ్డి, రామక్రిష్ణంరాజు, శ్రీధరరెడ్డి, తిరుమలరెడ్డి పాల్గొన్నారు.

పూడ్చిపెట్టిన మృతదేహానికి శవ పరీక్ష



మృతదేహానికి శవపరీక్ష నిర్వహిస్తున్న వైద్యులు

చెన్నూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు కొత్తగాంధీనగర్‌కు చెందిన సుందరరావు (63) గత ఏడాది డిసెంబరు 15న మృతి చెందడం జరిగింది. ఆ మృతదేహాన్ని పూడ్చిపెట్టగా బంధువులు కోరిక మేరకు శనివారం దానికి శవ పరీక్ష చేయడం జరిగింది. రిమ్స్ అసిస్టెంటు ప్రొఫెసర్ డాక్టర్ సుధాకర్ సీఐ కృష్ణారెడ్డి, తహసీల్దారు సరస్వతి, ఆర్ఐ కౌశిక్‌ల ఆధ్వర్యంలో ఈ శవ పరీక్ష నిర్వహించారు. కాగా గత ఏడాది అక్టోబరు 21న ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో సుందరరావుకు బలమైన గాయాలయ్యాయని, రిమ్స్‌కు అనంతరం తిరుపతి స్విమ్స్‌కు తీసుకువెళ్లగా డిసెంబరులో సర్జరీ చేశారు. చికిత్స పొందుతూ అక్కడే చనిపోవడం జరిగింది. కాగా ప్రమాదం విషయం పోలీసుస్టేషనులో చెప్పకపోవడంతో ఎలాంటి కేసులు నమోదు కాలేదు. చివరికి బంధువులు జిల్లా పోలీసు అధికారులను ఆశ్రయించడంతో వారి సూచనల మేరకు శనివారం మృతదేహాన్ని బయటికి తీసి శవ పరీక్ష చేశారు.

ఇద్దరు మట్కా బీటర్ల అరెస్టు

కడప క్రైం, మే 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో ఇద్దరు మట్కాబీటర్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ అమర్‌నాథరెడ్డి తెలిపారు. శనివారం ఆయన తెలిపిన వివరాల మేరకు.. పాతబస్టాండు సమీపంలో మట్కా ఆడుతున్నారన్న పక్కా సమాచారంతో సీఐ రామకిష్ణ ఆదేశాల మేరకు దాడి చేశామన్నారు. ఈ దాడిలో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వీరి వద్ద నుండి 12,200 నగదు, మొబైల్ ఫోను, మట్కాస్లిప్పులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ట్రాక్టర్ పైనుంచి పడి యువకుడి మృతి



రాజంపేట టౌన్, మే 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్ఎస్ రోడ్డులో ఓ ఇసుక ట్రాక్టర్‌పై కూర్చొని ప్రయాణిస్తున్న బి.వెంకటేశ్(28) ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందాడు. శనివారం సాయంత్రం హేమాద్రిపల్లెకు చెందిన వెంకటేష్ ఇసుక క్వారీ నుంచి పట్టణానికి తీసుకొని వస్తూ డ్రైవర్ సీట్ వద్ద కూర్చున్న వెంకటేష్ ప్రమాదవశాత్తు టైర్ కిందపడటంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. రాజంపేట పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పీలేరులో ఈదురుగాలుల బీభత్సం

● నేల రాలిన మామిడి

● ధ్వంసమైన పాలి హౌజ్



రైతు వెంకటరమణారెడ్డి తోటలో ధ్వంసమైన పాలి హౌజ్

పీలేరు, మే 3(ఆంధ్రజ్యోతి): పీలేరులో శనివారం మధ్యాహ్నం వీచిన ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. గాలుల తీవ్రతకు మండలంలోని పలుచోట్ల మామిడి పంట నేలరాలిపోగా కొన్నిచోట్ల షెడ్లు పాక్షికంగా ధ్వంసమయ్యాయి. పీలేరు మండలం ఇందిరమ్మ కాలనీ సమీపంలోని ఆదర్శ రైతు దేవిరెడ్డి వెంకటరమణారెడ్డి తోటలోని పలు చెట్లలో మామిడి పండ్లు నేలరాలాయి. అతని పొలంలోని పాలి హౌజ్ పాక్షికం గా ధ్వంసమైంది. దీంతో తనకు సుమారు రూ.3 లక్ష ల దాకా నష్టం వాటిల్లిందని వెంటకరమణా రెడ్డి వాపోయారు. అదే విధంగా రామిరెడ్డిగారిపల్లెకు చెందిన రైతు గరుడారెడ్డి తోటలోనూ మామిడి నేల రాలిపోయింది. తన తోటలోని అధిక శాతం చెట్లలోని మామిడి పండ్లు నేలరాలిపోయాయరని, తద్వారా తనకు రూ.5 లక్షల దాకా నష్టం వాటిల్లిందని గరుడారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అసలే అంతంత మాత్రంగా ఉన్న పంట, ఈదురు గాలికి నేలరాలిపోవడంతో తాను పూర్తిగా నష్టపోయాయని ఆయన తెలిపారు.

రాజా ఫౌండేషన్ భూములు స్వాధీనం

● నిబంధనల ఉల్లంఘనతో 50.37 ఎకరాలు ప్రభుత్వపరం

ప్రొద్దుటూరు, మే 3(ఆంధ్రజ్యోతి): మైలవరం మండల హెడ్‌క్వార్టర్స్‌లో రాజా ఫౌండేషన్‌కు 2005, 2009 సంవత్సరాలలో అప్పటి మార్కెట్ వాల్యూతో ఇచ్చిన 50.47 ఎకరాల భూములను నిబంధనల ఉల్లంఘన కారణంగా తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. శనివారం తహసీల్దారు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దారు మల్లికార్జున, మండల సర్వేయర్ సాయిలత, వీఆర్వో షాబుద్దీన్ తమ సిబ్బందితో కలిసి రాజా ఫౌండేషన్‌కు ఇచ్చిన భూములలో బోర్డులు పాతారు. మైలవరం గ్రామ పొలం సర్వేనెంబరు 74/1లో 12 ఎకరాలు అనాథ పిల్లలకు పునరావాస కేంద్రనిర్మాణంతో పాటు వృత్తి శిక్షణ కేంద్ర నిర్మాణం, గ్రామీణ నిరుద్యోగులకు ఉపాధి కల్పన కోసం కేటాయించారు. అలాగే సర్వే నెంబరు 74/2లో 3.03 ఎకరాలు, సర్వేనెంబరు 82 లో 7.90 ఎకరాలు, 83/1లో 6.54 ఎకరాలు, 84/1లో 11.12 ఎకరాలు, 85/1లో 7.41 ఎకరాలు, 86లో 4.00 ఎకరాలు మొత్తం 40 ఎకరాలలో ఎయిడ్స్ రోగుల పునరావాస కేంద్రం, అనాథ పిల్లలు, వీధి బాలలు, వికలాంగులకు ఫిజియోథేరపి సెంటర్‌తో పాటు విద్యా కేంద్రాలు నిర్మించాలని కేటాయించారు. ఫిబ్రవరి, మార్చి నెలల్లో తహసీల్దారు, ఆర్డీవోలు ఈ భూములు ప్రభుత్వ నిబంధనల మేరకు వినియోగింపబడుతున్నాయా లేదా అని విచారించి కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. ఈ భూముల్లో కేవలం సర్వేనెంబరు 74/1లోని 12 ఎకరాలలో డాడీ హోం బిల్డింగ్ 1.00 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించారు. ఎయిడ్స్ రోగుల పునరావాస కేంద్రం 10సెంట్లలో, బీఈడీ కాలేజీ 0.40 సెంట్లలో, పశువుల కొట్టం 0.10 సెంట్లలో, మూడు సెంట్లలో సమాధి నిర్మించి వున్నారని మొత్తం 12 ఎకరాలలో 1.63 ఎకరాలు తప్ప తక్కిన 10.37 ఎకరాలు ఖాళీగా వుంది. అలాగే పైసర్వేనెంబర్లలోని 40 ఎకరాల్లో కూడా ఏ ఒక్క నిర్మాణం చేపట్టక నిరుపయోగంగా వున్నదని తమ నివేదికలో పేర్కొన్నారు. నిరుపయోగంగా ఉన్న మొత్తం 50.37 ఎకరాల భూములను రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకుని బోర్డులు ఏర్పాటు చేశారు.



రాజా ఫౌండేషన్‌కు ఇచ్చిన స్థలాలను స్వాధీనం చేసుకోని బోర్డు ఏర్పాటు చేసిన తహసీల్దారు, సిబ్బంది

రాళ్లదాడి కేసులో ముగ్గురు అరెస్టు

కడప క్రైం, మే 3 (ఆంధ్రజ్యోతి): కడప నగరం సెవెన్‌రోడ్స్ వద్ద ఆకులవీధికి చెందిన వ్యక్తి ట్యాబ్లెట్లు కొనేందుకు రావడంతో ముగ్గురు వ్యక్తులు స్కూటీలో వచ్చి ఆయనపై దాడి చేసిన కేసుకు సంబంధించి ఇద్దరు యువకులు, ఒక యువతిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ రామక్రిష్ణ తెలిపారు. గత నెల 26న రాత్రి కడపకు చెందిన యువతి క్రిష్ణసర్కిల్ వద్ద తప్పిపోయిన బంధువును వెదుకుతున్న క్రమంలో మద్యం మత్తులో అక్కడికి వచ్చిన మహ్మద్ పీర్ అసభ్యకరంగా ప్రవర్తించాడని ఆమె మణికంఠ, నరసింహకు తెలిపిందన్నారు. మరుసటి రోజు ఏడురోడ్ల కూడలి వద్దకు మహ్మద్‌పీరా రావడంతో యువతితో పాటు ఇరువురు బైకుపై వచ్చి రాళ్లతో దాడి చేసి అక్కడి నుంచిపారి పోయారన్నారు. నరసింహ, మణికంఠలను క్రిష్ణసర్కిల్ వద్ద శనివారం అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు తెలిపారు.

పద్మశాలీయ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

కడప మారుతీనగర్, మే 3 (ఆంధ్రజ్యోతి): విద్యలో మరింత ప్రోత్సాహం అందించాలనే లక్ష్యంతో ఉత్తమ ఫలితాలు సాధించిన పద్మశాలీయ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు పద్మశాలీయ సేవా సంఘం అధ్యక్షుడు అవ్వారు సుబ్బరాయుడు తెలిపారు. శనివారం స్థానిక చిన్నచౌక్ వద్ద గల పద్మశాలీ భవన్(కళ్యాణమండపం)లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానంగా 10వ తరగతిలో 550 మార్కులకు పైగా, అలాగే ఇంటర్, ఎంపీసీ, బైపీసీ విభాగాలలో 900 మార్కులకు పైగా, ఆర్ట్స్ గ్రూపులలో 800 మార్కులకు పైగా, ఎంసెట్ ఇంజనీరింగ్, నీట్ మెడిసిన్ విభాగాలలో జిల్లా స్థాయిలోనే కాకుండా పట్టణ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించినవారు అర్హులన్నారు. మార్కుల జాబితాతో పాటు టీసీ జిరాక్స్‌కాపీ, రెండు పాస్‌పోర్టుసైజ్ ఫొటోలు, ఫోన్ నెంబర్, బయోడేటాతో సహా పూర్తిచేసిన దరఖాస్తులను జూన్ 5లోగా పద్మశాలీభవన్‌కు పంపించాలన్నారు. ఇతర వివరాలకు 9849026877, 9885122084 అనే నెంబర్లను సంప్రదించాలన్నారు. సమావేశంలో పద్మశాలీయ సేవాసంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు అవ్వారు వెంకటసుబ్బయ్య, విద్యాకమిటీ కన్వీనర్ వెంకటసుబ్బయ్య, యానాదయ్య, వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

కడప ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ బదిలీ

● కొత్త ప్రిన్సిపాల్‌గా డాక్టర్ జమున

కలికిరి, మే 3(ఆంధ్రజ్యోతి): కడప ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న డాక్టర్ సురేఖను బదిలీ చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. డాక్టర్ సురేఖను నంద్యాల ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమించింది. ఆమె స్థానంలో కడప ప్రిన్సిపాల్‌గా ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న డాక్టర్ టి.జమునను నియమించారు. ఈ మేరకు ప్రభుత్వ ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు శనివారం ఆదేశాలు జారీ చేశారు.

6న డయల్ యువర్ ఆర్టీసీ డిపో మేనేజరు

కడప మారుతీనగర్, మే 3 (ఆంధ్రజ్యోతి): ఏదేని ఆర్టీసీ బస్సుల రాకపోకల విషయంగా సమస్యలను నివృత్తి చేసుకునేందుకు వీలుగా ఈనెల 6న మంగళవారం డయల్ యువర్ కడప డిపో మేనేజరు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంబంధిత డిపో మేనేజరు ఢిల్లీశ్వరరావు తెలిపారు. మంగళవారం సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు ఆర్టీసీ సమస్యలపై ప్రజలు, ప్రయాణికులు తమ సమస్యలను సలహాలను సూచనలను తెలపాలన్నారు. 9959225774 అనే నెంబరుకు ఫోను చేసి లేదా వాట్సప్ చేసి తెలియపరచాలన్నారు.

అశ్వవాహనంపై శివకేశవులు

వల్లూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): పుష్పగిరి బ్రహ్మోత్సవాల్లో భాగంగా అశ్వవాహనంపై శివకేశవులు భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. శనివారం ఉదయం పరమేశ్వరునికి, కామాక్షి అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం లఘు పూర్ణాహుతి, సాయంత్రం వైద్యనాథేశ్వరుని సుందరంగా అలంకరించి అశ్వవాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు.

నేటి నుండి అగస్త్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

ప్రొద్దుటూరు టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన అగస్త్యేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను ఆదివారం నుండి 15వ తేదీ వరకు పది రోజులపాటు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఛైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి తెలిపారు. శనివారం విలేకరుల సమావేశంలో బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆదివారం బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేస్తామని, 5న స్వామివారి కల్యాణం, 12న రథోత్సవం, 13న భక్తులకు అన్నప్రసాద వినియోగం ఉంటుందని తెలిపారు. 6వ తేదీ నుండి ప్రతిరోజు సాయంత్రం స్వామివారిని వివిధ వాహన సేవల్లో గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు. ప్రతి రోజు సాయంత్రం 7 గంటలకు నటరాజ కళాక్షేత్రం చిన్నారులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. భక్తులు బ్రహ్మోత్సవాల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు మల్లికార్జునశెట్టి, మహేశ్వరశర్మ, వెంకటరామయ్య పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జిలను కలిసిన కలెక్టర్, ఎస్పీ

కడప రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాసదన్‌లో శని, ఆదివారాల్లో జరుగుతున్న జ్యుడిషియల్ వర్క్‌షాపు, జ్యుడిషియల్ కాన్ఫరెన్స్ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన రాష్ట్ర హైకోర్టు జడ్జిలు నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, బీఎల్ఎన్ చక్రవర్తిలను శనివారం కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎస్పీ అశోక్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు.

అలాగే ఉమ్మడి కడప జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని, జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ హైకోర్టు జడ్జిలను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలను అందజేశారు.



లక్ష్మీచెన్నకేశవస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే పుట్టా



బీటీ రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

బ్రహ్మంగారిమఠం, మే 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగురాళ్లపల్లె పంచాయతీ కొత్తపల్లె గ్రామంలో వెలసిన లక్ష్మీచెన్నకేశవస్వామి తిరునాళ్లకు ఎమ్మె ల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ శనివారం హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఇటీవల రూ.94 లక్షలతో నిర్మించిన బీటీ రోడ్డును ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. దేవస్థానం ఆలయ ప్రాంగ ణంలో వృషభరాజముల బండలాగుడు పోటీలు ప్రా రంభించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడు తూ మెదకూరు నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్ది ప్రతి మండలాన్ని అభివృద్ధి బాటలో తీసుకువస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు చెన్నుపల్లె సుబ్బారెడ్డి, యువ నాయకుడు కాణాల మల్లికార్జునరెడ్డి, మేకల పసుదాకర్ , యల్లటూరు సాంబశివారెడ్డి, చిలమల నాగయ్య, సర్పంచ్ నారాయణ, సన్నపూరి శ్రీను, తేకలకుంట్ల శివ, గుజ్జు రామాంజనేయులు, ముదుమాల పోలిరెడ్డి, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.





37 మంది హీరోలతో సినిమాలు తీసి అత్యధిక హిట్స్ ఇచ్చిన ఏకైక దర్శకుడు ఆయన ఒక్కరే. అలాగే 77 మంది హీరోయిన్లతో చిత్రాలు తీసిన ఘనత ఇండియాలో రాఘవేంద్రరావుకు మాత్రమే సొంతం.

నేను రుణపడేది ఆయనకే!

తెలుగు సినిమాకు మాస్ హంగులు అద్ది, బాక్సాఫీసును షేక్ చేసిన దర్శకుడు... తెలుగు పాటను రంగులతో అభిషేకించి, సంగీతంతో సంబరాలు చేయించిన సంగీతాభిమాని. హిట్స్, రికార్డ్ బ్రేక్ కలెక్షన్లు, సిల్వర్ జూబ్లీలు, పొగడ్తలు... ఇలా అన్నీ కట్టకట్టుకువచ్చి మీదపడినా.. అన్నిటినీ చిరునవ్వుతో స్వీకరించడం తప్ప, స్టేజ్ మీద కానీ, మరెక్కడైనా కాని అహంకారంతో ఎప్పుడూ ఆయన మాట్లాడలేదు... 'గ్లామర్, గుట్టల గుట్టల పండ్లు, నాయికల నాభి తప్ప... అంతకంటే ఏం తియ్యగలడు' అనే వాళ్లకు 'అన్నమయ్య' అనే అద్భుతాన్ని అందించి తన ప్రతిభను పండించుకున్న ఆ దర్శకుడు... కె. రాఘవేంద్రరావు. యాభై ఏళ్ల కెరీర్‌ను విజయవంతంగా పూర్తి చేసుకున్న ఆ దర్శకేంద్రుడు తన సినీ పయనంలో ఎదురైన ఆసక్తికరమైన సంఘటనలను, విశేషాలను 'నవ్య'కు వివరించారిలా...



మీరందరూ యాభై ఏళ్లు అయిందని చెబుతుంటే ఆనందంగా ఉంది. నిజం చెప్పాలంటే 'పరిశ్రమలోకి వచ్చి ఇన్నేళ్లు అయింది, ఇన్ని సినిమాలు చేశాను' అని నేను ఎప్పుడూ లెక్క పెట్టుకోలేదు. నా పని నేను చేశాను. 'వెయ్యి కోట్ల రూపాయలు కావాలా, డైరెక్షన్ ఛాన్స్ కావాలా?' అని ఎవరైనా ఆఫర్ ఇస్తే... ఇప్పటికీ దర్శకత్వాన్నే కోరుకుంటా. డైరెక్షన్ అంటే నాకు అంత పిచ్చి. ఇన్నేళ్ల నా కెరీర్‌లో ఒకే ఒక వ్యక్తికి రుణపడి ఉంటాను. ఆయనే ఎన్టీఆర్. 'పాండవ వనవాసం' చిత్రంతో పరిశ్రమలోకి ప్రవేశించి, రామారావుగారి మీద తొలి క్లాప్ ఇచ్చాను. అలాగే ఆయన నటించిన 'అడవిరాముడు' సినిమా నుంచే అగ్ర దర్శకుడిగా ఎదిగాను. ఆ రోజు రామారావుగారి మీద క్లాప్ ఇచ్చిన తర్వాత ప్రేక్షకులు ఇన్నేళ్లుగా నా సినిమాలు చూస్తూ ఇన్ని క్లాప్స్ కొడతారని ఊహించలేదు. సినిమా పాటకు ప్రేక్షకులు పట్టాభిషేకం చేసిన సినిమా 'అడవిరాముడు'. రామారావుగారు నడిచి వస్తుంటే ఆ రోజుల్లో జనం పూలు జల్లేవారు, హారతులు ఇచ్చేవారు. 'ఆయన నడిచి వస్తేనే ఇలా చేస్తున్నారు, ఏనుగు ఎక్కిస్తే ఇంకెంత ఆనందిస్తారో?' అని అడవిరాముడు తీశాను. ఆ సినిమాలోని 'ఆరేసుకోబోయి పారేసుకున్నాను' పాట చూసి జనం డబ్బులు విసరడం మొదలుపెట్టారు. అప్పటినుంచి మా కాంబినేషన్‌కు క్రేజ్ మొదలైంది. అలాగే నిర్మాతలు లేకపోతే నేను లేను. ఈ యాభై ఏళ్ల జర్నీ ఇంత విజయవంతంగా సాగడానికి నా నిర్మాతలే కారణం. నాతో పని చేసిన నటీనటులు, సాంకేతిక నిపుణులకు, పంపిణీదారులకు, థియేటర్ యజమానులకు, నన్ను ఆదరించిన ప్రేక్షకులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు.

• హీరో కావాలని అనుకోలేదు

నాకు సినిమాలు అంటే చాలా చాలా ఇష్టం. పుస్తకాలు కొనుక్కోమని ఇంట్లో డబ్బులు ఇస్తే అవి కొనకుండా సినిమాలకు వెళ్లి, స్నేహితుల పుస్తకాలు చదివిన రోజులు ఉన్నాయి. దాదాపు ప్రతి రోజూ సినిమా చూసిన సందర్భాలు ఉన్నాయి. నాకు మొదటి నుంచీ నటన మీద ఆసక్తి లేదు. దర్శకుడినవ్వాలనేదే నా కోరిక. నటుడినో, హీరోనో కావాలని ఎప్పుడూ అనుకోలేదు.

• లక్ష రూపాయలతో తొలి సినిమా అనుకున్నా

ఎన్టీఆర్, కృష్ణ తొలిసారిగా కలసి నటించిన 'స్త్రీ జన్మ' చిత్రానికి నాన్నగారు దర్శకుడు. నేను అసిస్టెంట్ డైరెక్టర్‌ని. సెట్‌లో నా ఇన్వాల్వ్‌మెంట్, పనితీరు గమనించిన ఆ చిత్ర నిర్మాత రామానాయుడు గారు "రాఘవేంద్రరావ్.. నీ ఫస్ట్ పిక్చర్ నాకే చెయ్యాలి" అనేవారు. "ఇప్పుడు కాదు.. తర్వాత చూద్దాంలే" అన్నారు నాన్నగారు. ఆ తర్వాత నా ఫ్రెండ్స్ ఏవీఎం సీజర్, అడుసుమిల్లి కుమార్, గోపాలకృష్ణ కలసి నా దర్శకత్వంలో సినిమా తీద్దామని వచ్చారు. "ఎవరూ చేయని విధంగా సినిమా తీద్దాం. పల్లెటూరికి వెళ్దాం. లక్ష రూపాయల బడ్జెట్‌లో తీద్దాం" అన్నాను. "లేదు లేదు భారీ బడ్జెట్‌లో తీద్దాం" అన్నారు వాళ్లు. 'బాబు' సినిమాకు మా నాన్న కథ ఇచ్చారు. శోభన్‌బాబు హీరో. ముగ్గురు హీరోయిన్లు. చాలా భారీగా తీశాం. నాకు తొలి అవకాశం ఇచ్చిన ఆ ముగ్గురు మిత్రులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు. సినిమాకు మంచి ఓపెనింగ్స్ వచ్చాయి. అయితే మా సినిమా విడుదలైన కొన్ని రోజులకు విశ్వనాథ్‌గారి 'జీవనజ్యోతి' రిలీజ్ అయింది. ఆ చిత్రం చూడగానే నా సినిమా భవిష్యత్ అర్థమై పోయింది. ఊహించినట్లుగానే 'జీవనజ్యోతి' వచ్చాక మా సినిమా వసూళ్లు తగ్గాయి.

• మూడు తరాల హీరోలతో...

నేను నిర్మాతల దర్శకుణ్ణి. ఎక్కువ రోజులు షూటింగ్ చేసి నిర్మాతను ఇబ్బంది పెట్టలేదు. అందుకే ఒక్కో నిర్మాతకు చాలా సినిమాలు చేసే అవకాశం కలిగింది. నా అదృష్టం ఏమిటంటే.. నా దర్శకత్వంలో నటించడానికి ఏ హీరోకానీ, నటుడు కానీ 'నో' అనలేదు. మూడు తరాల హీరోలతో పని చేశాను. అందరికీ గుర్తుండిపోయే హిట్స్ ఇచ్చే అవకాశం దక్కడం నా అదృష్టం.

• ఆ టెన్షన్ ఉండేది

రామారావుగారు ఒక సినిమా కోసం దాదాపు 40 రోజుల పాటు ఔట్‌డోర్‌లో ఉండడం అన్నది 'అడవిరాముడు'తోనే మొదలు. అంతవరకూ ఆయనకు ఔట్‌డోర్ అంటే మద్రాసు గిండీ ఫారెస్టే. అటువంటి వ్యక్తి ఈ చిత్రకథ నచ్చి అన్ని రోజులు ఔట్‌డోర్‌లో ఉండిపోయారు. మధ్యలో ఒకటి రెండు సార్లు 'దానవీరశూర కర్ణ' చిత్రం రీరికార్డింగ్ కోసం మద్రాసు వెళ్లి వచ్చారేమో! 'ఈ సినిమా ఆడకపోతే నా కెరీర్ ఏమవుతుందా?' అనే టెన్షన్ 'అడవిరాముడు' చేస్తున్నప్పుడు నాకు ఉండేది. చిన్న సినిమాలు చేసుకోవచ్చు కానీ రామారావుగారు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పట్టుదలతో పని చేశాను. రామారావుగారు షూటింగ్ ముగించుకుని వెళ్లిపోతూ "నా కెరీర్‌లో ఇది మధుర జ్ఞాపకం' అని మెచ్చుకోవడం మరిచిపోలేని సంఘటన. ఫెయిల్యూర్స్ వచ్చినప్పుడు కూడా నా హీరోలు ఎన్టీఆర్, కృష్ణ, శోభన్‌బాబు, చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేశ్... ఎవరూ నిరుత్సాహపరిచేలా మాట్లాడలేదు. నాకు ఎంతో సపోర్ట్ ఇచ్చారు. అది వారి గొప్పతనం. ముఖ్యంగా రామారావుగారు. ఆయనకు 'సింహబలుడు', 'తిరుగులేని మనిషి' అని రెండు ఫ్లాప్స్ ఇచ్చాను. ఆయన వద్దు అనుకుంటే నాకు మరో అవకాశం వచ్చేది కాదు.. కానీ ఆయన గొప్పతనం ఏమిటంటే.. "ఇట్సాల్ రైట్ బ్రదర్.. ఏం తీయకూడదో నేర్చుకున్నాం. ఈ సారి మంచి కథతో ప్లాన్ చేయండి..' అన్నారు., ఆయన ఆఖరి చిత్రం 'మేజర్ చంద్రకాంత్' చేసే అవకాశం నాకు దక్కడం నా అదృష్టం. అందుకే ఏ ఫంక్షన్‌కు వెళ్లినా "రామారావుగారి వల్లే నేను ఈ స్థాయిలో ఉన్నాను" అని చెబుతుంటాను.

• సోషల్ మీడియాను కంట్రోల్ చెయ్యాలి

సోషల్ మీడియాను కంట్రోల్ చేసే పరిస్థితి రావాలి. ముఖ్యంగా కొన్ని యూ ట్యూబ్ ఛానల్స్ పెట్టే హెడ్డింగ్స్ ఇబ్బందికరంగా ఉంటున్నాయి. వాటిని అదుపు చేయాలి. ఈ విషయంలో నేను కూడా ఓసారి ఇబ్బంది ఎదుర్కొన్నా. అయితే వాటిని నేను పట్టించుకోను కనుక రియాక్ట్ కాలేదు. కానీ రాను రాను విచ్చలవిడితనం పెరిగిపోతోంది.

• పాటలో మొత్తం రామాయణం

నా కెరీర్‌లో అన్ని రకాల చిత్రాలూ చేశాను. 'అన్నమయ్య', 'శ్రీరామదాసు', 'పాండురంగడు'. 'మంజునాథ' 'శిరిడి', 'నమో వేంకటేశ' లాంటి సినిమాలు చేశాను. ఇప్పుడు ఓ పాటలో మొత్తం రామాయణాన్ని చూపించాలని నా కోరిక . దానికి సంబంధించిన టెస్ట్ షూట్ కూడా చేశా. అలాగే 'వల్లీ కల్యాణం' కూడా సినిమాగా తీయాలనే ఆలోచన ఉంది.

• వినాయకరావు

28 రోజుల్లో 'జ్యోతి'



ఒక పెద్ద సినిమా తీసిన వెంటనే ఓ చిన్న చిత్రం తీయడం చాలా మంచిది. ఆ పద్ధతిని చాలా రోజులు కొనసాగించా. ప్రేక్షకులు అంచనాలు పెంచుకునే అవకాశం ఇవ్వకూడదు. ఎందుకంటే 'ఏం తీస్తాడు, ఎలా తీస్తాడు..' అని వారంతా ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు. అందుకే రెండో సినిమా 'జ్యోతి'ని ప్రయోగాత్మకంగా 28 రోజుల్లో తీశాను. మురళీమోహన్, జయసుధ జంటగా నటించారు. ఆ సినిమా మంచి విజయం సాధించింది. మురళీమోహన్‌తో చేసిన 'కల్పన' చిత్రం విడుదల అయిన వారం రోజులకు 'అడవిరాముడు' వచ్చింది. ఈ రెండు సినిమాలూ హిట్ అయ్యాయి. అలాగే 'సింహబలుడు' చిత్రం భారీ బడ్జెట్‌తో తయారైతే, ఆ సమయంలోనే 'పదహారేళ్ల వయసు' చిత్రం లోబడ్జెట్‌తో వచ్చింది.

ముగ్గురు హీరోలతో 'త్రివేణి సంగమం'




నా నూరవ సినిమాను మొదట చాలా విభిన్నంగా ప్లాన్ చేశాను. చిరంజీవి, నాగార్జున, వెంకటేశ్‌లతో ఆ సినిమా చేయాలని అనుకొని వారిని అడిగాను. ముగ్గురూ ఒప్పుకొన్నారు. 'త్రివేణి సంగమం' అని టైటిల్ అనుకున్నా. ఈ సినిమాను అరవింద్, అశ్వనీదత్‌లతో కలసి తీయాలని ప్లాన్ చేశా. అయితే పాటల విషయంలో అభిమానుల మధ్య అభిప్రాయ బేధాలు వస్తాయేమో అనే అనుమానం వచ్చి ఆ ప్రాజెక్ట్ ఆపేశాం. అప్పుడు ఓ కొత్త హీరోతో చిన్న సినిమా తీద్దామని అల్లు అర్జున్‌ను పరిచయం చేస్తూ 'గంగోత్రి' తీశాం.

మరచిపోలేని మూడు సంఘటనలు



యాభై ఏళ్ల కెరీర్‌లో మరచిపోలేని మధుర సంఘటనలు మూడు ఉన్నాయి. 'అడవిరాముడు' చిత్రంతోనే పాటలు వచ్చినప్పుడు తెరపైకి డబ్బులు విసరడం అనే ట్రెండ్ మొదలైంది. అలాగే 'జగదేకవీరుడు-అతిలోకసుందరి' చిత్రం పెద్ద తుపాన్ వచ్చిన సమయంలో విడుదల అయింది. చాలా థియేటర్లలో షోలు పడని పరిస్థితి. కానీ ఒక థియేటర్‌లో మాత్రం వర్షపు నీటిని మోటార్లు పెట్టి బయటకు తోడేస్తుంటే, జనం కుర్చీలో కాళ్లు పెట్టుకుని ఆ సినిమా చూశారు. 'అన్నమయ్య' చిత్రంలో 'మోకాళ్ల పర్వతాన్ని చెప్పులు వేసుకుని ఎక్కకూడదు' అని భానుప్రియ నాగార్జునకు చెప్పే సీన్ వచ్చినప్పుడు థియేటర్‌లో ప్రేక్షకులు కూడా చెప్పులు విడిచిపెట్టి సినిమా చూశారు.

ఇప్పుడు తీరికే లేదు



'పెళ్లిసందడి' చిత్రం మళ్లీ తీసిన తర్వాత ఏం చేయాలా అని నాకు తోచలేదు. ఇన్ని సంవత్సరాలు వర్క్ చేసిన తర్వాత న్యాయంగా అయితే రిటైర్ అవ్వాలి, కానీ నాకు పని లేకపోతే తోచదు. అప్పుడు బాగా ఆలోచించి యూ ట్యూబ్ ఛానల్ స్టార్ట్ చేశా. షార్ట్ ఫిల్మ్స్ తీసి అప్‌లోడ్ చేస్తున్నా. పిల్లలకు సంబంధించి రెండేసి నిముషాల షార్ట్ ఫిల్మ్స్ ఏ.ఐ.లో తీస్తున్నాం. దానికోసం తీరిక లేకుండా వర్క్ చేస్తున్నా. కీ బోర్డ్ నేర్చుకుంటున్నా. అలాగే 'కెఆర్ఆర్ క్లాస్‌రూమ్' పేరుతో సినిమాల గురించి ప్రాక్టికల్ నాలెడ్జిని ఔత్సాహికులకు ఉచితంగా చెబుతున్నా.

ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా ఓటీటీలో విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌లు...

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్	THE DIPLOMAT	
ది డిప్లొమాట్	హిందీ చిత్రం	మే 09
గుడ్ బ్యాడ్ అగ్లీ	తమిళ చిత్రం	మే 08
ది రాయల్స్	హిందీ సిరీస్	మే 09
అమెజాన్ ప్రైమ్	Royals	
గ్రామ్ చికిత్సాలయ్	హిందీ చిత్రం	మే 09
జియో హాట్‌స్టార్		
స్టార్‌వార్స్	యానిమేషన్ సిరీస్	మే 04

వినోదాత్మక చికిత్స



ఓ మారుమూల పల్లెలో ప్రభుత్వ ఆస్పత్రి నేపథ్యంలో తెరకెక్కిన హిందీ సిరీస్ 'గ్రామ్ చికిత్సాలయ్'. అక్కడి వసతుల లేమి, వైద్యుల నిర్లక్ష్యంతో అమాయక గ్రామీణులు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తూ వారి చేతుల్లో దోపిడీకి గురవుతుంటారు. ఈ పరిస్థితుల్లో బదిలీపై ఆ గ్రామానికి వచ్చిన ప్రతిభావంతుడైన యువ వైద్యుడు ప్రభాత్ ఆ పరిస్థితులను మార్చాలని కంకణం కట్టుకుంటాడు. ఆ నేపథ్యంలో అతనికి ఎదురైన సవాళ్లు ఏమిటి, ప్రజలు అతనికి సహకరించారా అనేది వినోదాత్మకంగా ఈ సిరీస్‌లో ఆవిష్కరించారు. అమోల్ పరాశర్ వినయ్ పాఠక్, ఆకాంక్ష రంజన్ కీలకపాత్రలు పోషించారు. రాహుల్ పాండే దర్శకుడు.

బియ్యం నీళ్లు చేసే అద్భుతం..!

ప్రస్తుతం ప్రతి ఒక్కరూ... శిరోజాలు రాలడం, అవి నిర్జీవంగా మారడం, వాటి చివర్లు చిట్లడం, చుండ్రు లాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. వీటిని నివారించేందుకు బియ్యం నీళ్లు అద్భుతంగా పనిచేస్తాయని నిపుణులు చెబుతున్నారు.

ఇలా తయారు చేసుకోవాలి...

• ఒక గిన్నెలో ఒక కప్పు బియ్యాన్ని తీసుకుని శుభ్రంగా కడగాలి. వెంటనే రెండు కప్పుల నీళ్లు పోసి అరగంటసేపు నానబెట్టాలి. తరవాత ఈ నీటిని మరో గిన్నెలోకి వడకట్టాలి.



• బియ్యాన్ని నీటిలో రెండు రోజులు నానబెడితే ఆ నీటిని 'ఫెర్మెంటెడ్ వాటర్' అంటారు. ఈ నీళ్లు మాడుకు, శిరోజాలకు అదనపు ప్రయోజనాలను అందిస్తాయి. ఫెర్మెంటెడ్ వాటర్‌ను ఫ్రిజ్‌లో వారంపాటు నిల్వ చేసుకోవచ్చు.

• బియ్యం నీటిలో లావెండర్ లేదా రోజ్‌మేరీ ఆయిల్ చుక్కలు వేసుకుంటే ఫలితం బాగుంటుంది.

• బియ్యం నీళ్లలో బి, ఇ విటమిన్లతోపాటు మెగ్నీషియం, పొటాషియం లాంటి మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి.

ఇలా వాడాలి...

• ముందుగా శిరోజాలను కుంకుళ్లు లేదా గాఢత తక్కువగా ఉన్న షాంపూతో శుభ్రం చేసుకోవాలి. తలను కొద్దిగా ఆరనివ్వాలి. తరవాత బియ్యం నీటిని చేత్తో తీసుకుంటూ కురులకు, మాడుకు పట్టించాలి. బియ్యం నీటిని ఒక స్ప్రే బాటిల్‌లో పోసి తలంతా చిలకరించుకోవచ్చు. అయిదు నిమిషాల తరవాత తలను వేళ్లతో సున్నితంగా మర్దన చేయాలి. పావుగంటసేపు ఆరనిచ్చి మంచినీళ్లతో తలను శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తూ ఉంటే శిరోజాలు ఒత్తుగా పెరుగుతాయి.

విమానం ఎక్కేముందు...

విమానం ఎక్కేముందు కొన్ని రకాల ఆహార పదార్థాలు తినకపోవడమే మంచిదనీ లేదంటే ప్రయాణంలో అనారోగ్య సమస్యలు తప్పవనీ నిపుణులు చెబుతున్నారు.

• సాధారణంగా అల్పాహారం కింద బ్రోకలీ, క్యాబేజీ తురుము, వెనిగర్ వేసి తయారు చేసిన సలాడ్స్ తీసుకుంటూ ఉంటారు. వీటివల్ల గ్యాస్ చేరి కడుపు ఉబ్బరిస్తుంది. ఉదయం వేళ విమాన ప్రయాణం చేయాల్సి ఉంటే వీటిని తినకపోవడమే మంచిది.

• విమానం ఎక్కడానికి ఒక రోజు ముందు నుంచి బీన్స్, పప్పు దినుసులు తినకూడదు. ఇవి జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. కాబట్టి విమానం ఎక్కగానే కడుపులో సమస్యలు ఏర్పడవచ్చు.

• నూనె పదార్థాలు, వేపుళ్లు, చిప్స్, వీధుల్లో అమ్మే పదార్థాలు తినకూడదు. వీటివల్ల కడుపులో వికారం, వాంతులు, తలనొప్పి లాంటి ఆరోగ్య సమస్యలు రావచ్చు.

• విమానం ఎక్కడానికి గంట ముందు నుంచి కార్బొనేటెడ్ డ్రింక్స్, ఆల్కహాల్ తీసుకోకూడదు. వీటివల్ల కడుపులో తిప్పడం, తల తిరగడం, తేన్పులు, కడుపు ఉబ్బరించడం లాంటివి ఏర్పడవచ్చు. సరిగా నిద్ర పట్టక అలసటగా అనిపిస్తుంది.

• కొంతమందికి చూయింగ్ గమ్ నమలడం, క్యాండీస్ తినడం అలవాటుగా ఉంటుంది. వీటివల్ల కూడా సమస్యలు ఏర్పడవచ్చు.

• విమానం ఎక్కేముందు కారంగా ఉన్నవి, మసాలాలు చేర్చిన ఆహార పదార్థాలు తినకూడదు. వీటి వల్ల గుండెలో మంటగా అనిపిస్తుంది.



అద్భుతమైన మహిళల కోసం

నూట తొంభై ఐదు దేశాలు... పది లక్షలమంది మహిళలు... వారి జీవన స్థితిగతులు... 'మిలియన్ అమేజింగ్ ఉమెన్' పేరుతో మహత్తర ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు... విశాఖకు చెందిన భరద్వాజ్ దయాల. వివిధ దేశాల్లో విభిన్న రంగాల్లో రాణిస్తున్న మహిళల జీవితాలను ప్రతిబింబిస్తూ ఒక డాక్యుమెంటరీ రూపొందిస్తున్నారు. ఏడాదిన్నరలో బైక్‌పై ఐదు ఖండాలు, 16 దేశాలు చుట్టివచ్చిన ఆయన... 'నవ్య'తో ఆ విశేషాలు పంచుకున్నారు.



"సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం. భారీ జీతం. కానీ జీవితమంటే సంపాదన మాత్రమే కాదని కొన్నేళ్ల ఉద్యోగ జీవితం తరువాత అనిపించింది. దానికితోడు కొత్తగా ఏదైనా చేయాలన్న తపన నన్ను కుదురుగా కూర్చోనివ్వలేదు. దాంతో 2006లో బైక్‌పై ప్రపంచ యాత్రకు శ్రీకారం చుట్టాను.

ఐదు ఖండాల్లోని 16 దేశాల మీదుగా 48 వేల కిలోమీటర్లు ప్రయాణించాను. ఏడాదిన్నరపాటు సాగింది ఈ యాత్ర. బైక్‌పై ప్రపంచ యాత్ర పూర్తి చేసిన తొలి భారతీయుడిగా గుర్తింపు పొందాను. ఆ యాత్ర విశాఖలో ప్రారంభమై... ఇరాన్, టర్కీ, సిరియా, జోర్డాన్ మీదుగా ఆఫ్రికా, ఈజిప్ట్, యూరప్‌లోని గ్రీస్ వరకూ సాగింది. ఆ తరువాత ఫ్రాన్స్ మీదుగా యూకే అట్లాంటిక్ సముద్రం దాటి కెనడా, అమెరికా చేరుకున్నా. పసిఫిక్ మహా సముద్రం దాటి న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, ఇండోనేషియా, బంగ్లాదేశ్ మీదుగా భారత్‌కు వచ్చాక మళ్లీ ఉద్యోగ జీవితంలో నిమగ్నమయ్యాను. ఈ క్రమంలోనే మా అమ్మ కుసుమ దయాల్ ఐదుగురి సంతానాన్ని పెంచి పోషించేందుకు చేసిన త్యాగం, పడిన కష్టాలు గుర్తుకువచ్చాయి. అమ్మ లాంటి ఎంతోమంది మాతృమూర్తుల గురించి ప్రపంచానికి తెలియజేయాలన్న ఉద్దేశంతో 'మిలియన్ అమేజింగ్ ఉమెన్' డాక్యుమెంటేషన్‌కు శ్రీకారం చుట్టాను.

దేశదేశాల్లోని మహిళల జీవితాలతో...

195 దేశాల్లోని విభిన్న రాష్ట్రాలు, జాతులు, కులాలు, మతాలు, వర్గాలకు చెందిన పది లక్షల మంది మహిళల జీవితాలను ఆవిష్కరించడమే 'మిలియన్ అమేజింగ్ ఉమెన్' డాక్యుమెంటరీ ప్రధాన ఉద్దేశం. ఉన్నత స్థాయి నుంచి కూలి పనులు చేసుకునే మహిళల వరకు అందరి జీవితాలకు సంబంధించిన కీలక ఘట్టాలు అందులో ఉంటాయి. ఇప్పటివరకూ ఇలా ఇన్ని దేశాల మహిళల ఫొటోగ్రఫీలతో కూడిన డాక్యుమెంటు ఎవరూ చేయలేదు. అందుకే నేను ఈ మహత్తర కార్యం చేపట్టాలని అనుకున్నాను.

మహిళా దినోత్సవంనాడు...

'మిలియన్ అమేజింగ్ ఉమెన్స్' డాక్యుమెంటేషన్ పూర్తికావడానికి పది నుంచి పన్నెండేళ్ల సమయం పడుతుందని అంచనా. గత నెల, అంటే మార్చి 8న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గుజరాత్‌లోని బరోడా నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాను. ఇందులో తొలి పోర్ట్రైట్ ఫొటో బరోడా రాజమాత సుభాంగిని రాజేది. బ్రిటిష్ రాణి కంటే అతిపెద్ద కోటలో ఉండే ఆమెకు సంబంధించిన ఫొటోను తీయడం ద్వారా డాక్యుమెంటేషన్ ప్రారంభమైంది. ఇప్పటివరకూ 400 మందికిపైగా మహిళల ఫొటోలు, వివరాలు సేకరించాను. ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాలకు చెందిన మహిళలపై డాక్యుమెంటేషన్ సాగుతోంది. ప్రస్తుతం ఉత్తర భారత్‌లోని పలు రాష్ట్రాల మహిళలను కెమెరాలో బంధించే పనిలో ఉన్నాను. ఇప్పటివరకు సంప్రతించినవారిలో రోజు కూలీలు, గిరిజన మహిళలు, సామాజిక కార్యకర్తలు, కార్మికులు ఉన్నారు. అన్నీ కలిపి 'మిలియన్ అమేజింగ్ ఉమెన్' వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తాను. కొన్ని వీడియోలు కూడా చిత్రీకరిస్తున్నాను. ప్రతి మహిళ వెనుక ఒక విజయ గాథ ఉంటుంది. దాన్ని ఈ ప్రపంచానికి చెప్పడమే నా ఉద్దేశం. పది లక్షలమంది మహిళలకు సంబంధించిన డాక్యుమెంటేషన్ అంటే సాధారణ విషయం కాదు. ఎన్నో వ్యయప్రయాసలు పడాలి. అందుకు సిద్ధమయ్యే ఈ అద్భుత ప్రాజెక్ట్‌ను చేపట్టాను."

- బూటు శ్రీనివాసరావు, విశాఖపట్నం

సంపాదించింది అంతా...

ఉద్యోగానికి రాజీనామా చేసి ఈ ప్రాజెక్ట్ ప్రారంభించాను. దీని కోసం ఇప్పటివరకూ నేను సంపాదించింది అంతా ఖర్చు చేస్తున్నాను. దీనిలో భాగంగా నా కారును ప్రత్యేకంగా డిజైన్ చేయించుకున్నాను.

నేటి నుంచి ఉలవల గంగమ్మ జాతర

పీలేరు, మే 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని తలపుల గ్రామంలో ఆదివారం నుంచి మూడు రోజుల పాటు ఉలవల గంగమ్మ జాతర నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు ఆదివారం ఉదయం 8 గంటలకు అభిషేకంతో ప్రారంభమయ్యే ఉత్సవాలు మంగళవారం ఉదయం జంతు బలితో ముగుస్తాయని ఆలయ కమిటీ కార్యదర్శి వెంకట రమనాయునివారు తెలిపారు. ఆదివారం రాత్రి ప్రొద్దుటూరుకు చెందిన వెంకటసాయి కళాకారుల ఆధ్వర్యంలో భక్త చింతామణి నాటకం, సోమవారం మధ్యాహ్నం గంగావతి భాగవతారిణి హరికథా కాలక్షేపం, రాత్రి 10 గంటలకు కోలాట ప్రదర్శన, చెక్కభజనలు, చాందినీ బండ్ల ఊరేగింపు, మొక్కుబడులు చెల్లింపు ఉంటాయన్నారు.

బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు

మదనపల్లె అర్బన్, మే 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోతులూరి వీరబ్రహ్మంగారి ఆలయంలో ఆదివారం నుంచి ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయకమిటీ సభ్యులు తెలిపారు. 4వ తేదీ ఆదివారం నుంచి 9వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు మాట్లాడుతూ ఉత్సవాలకు విచ్చేసే భక్తులకు అన్ని సౌకర్యాలతోపాటు అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాలను స్వర్ణకారుల సంఘం, నవయుగ స్వర్ణాకారులు పర్యవేక్షిం చనున్నారు.

నరసింహస్వామికి పూజలు

గుర్రంకొండ, మే 3(ఆంధ్రజ్యోతి):మండలంలోని తరిగొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం ఉదయం అర్చన, పంచామృతాభిషేకం చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించారు. అధికసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంచముఖి ఆంజనేయస్వామికి పూజలు

కలకడ, మే 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాటవారిపల్లెలో వున్న పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి అభిషేకం, ఆకు పూజ చేశారు. సమీప గ్రామాల ప్రజలు స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

పిడుదుల మందు తాగిన వృద్ధుడికి అస్వస్థత

మదనపల్లె అర్బన్, మే3 (ఆంధ్రజ్యోతి): నీళ్లు అనుకుని పొరపాటున ఆవుల కోసం కలిపిన పిడుదుల నివారణ మందు తాగి వృద్ధుడు అస్వస్థతకు గురయ్యాడు. బాధితుడి కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు పుంగనూరు మండలం, అప్పిన పల్లెకు చెందిన కృష్ణప్ప(65) శనివారం మధ్యాహ్నం నీళ్లు అనుకుని చెంబులో ఉన్న పిడుదుల మందు ను తాగాడు, గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆయన ఇక్కడి చికిత్స పొందుతన్నాడు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లెఅర్బన్, మే 3(ఆంధ్రజ్యోతి):కడుపునొప్పి తాళలేక ఓ యువతి శనివారం విషం తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. ఆస్పత్రి అవుట్ పోలీసుల కథనం మేరకు మదనపల్లె మండలం నక్కలదిన్నె తాండాకు చెందిన రవీంద్రనాయక్ భార్య పూజిత (19) ఇంట్లోనే విషం తాగింది, గమనించిన కుటుం బసభ్యులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుతల్వ ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు వైద్యం అందించారు.

ఊరి బయటే.. బియ్యం పంపిణీ!

- ఐదేళ్లుగా ఇదే తంతు..
- ఇబ్బందులు పడుతున్న శివపురంవాసులు

పెద్దమండ్యం, మే 3(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం పంపిణీ చేసే వాహనం గ్రామంలోకి రాకపోవడంతో మండల పరిధిలోని శివపురం గ్రామ ప్రజలు ఐదేళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వివరాలోకి వెళితే.. ఎండీఎస్ వాహనాల ద్వారా ప్రభుత్వం ప్రతి ఇంటికీ రేషన్ సరుకులు పంపిణీ చేస్తామని గత వైసీపీ ప్రభుత్వం చేసిన ప్రకటించింది. అయితే, గత ఐదేళ్ల కాలంలో మండలంలోని శివపురం గ్రామంలో అమలుకు నోచుకోలేదు. ఏనాడూ ఎండీఎస్ వాహనం గ్రామంలోకి రాకపోగా, గ్రామం బయట రోడ్డుపై వాహనాన్ని నిలిపి పంపిణీ చేస్తున్నారని రేషన్‌కార్డుదారులు వాపోతున్నారు. శివపురం గ్రామంలో సెల్ టవర్ సిగ్నల్ లేకపోవడంతో ఈ-పాస్ యంత్రం పనిచేయక పోవడంతోనే ఈ దుస్థితి నెలకొందని చెబుతున్నారు. దీంతో గ్రామానికి ఒక ఫర్లాంగ్ దూరంలో ఉత్తర దిశ మిట్ట మీద సిగ్నల్ రావడంతో అక్కడే ప్రతినెల బియ్యం తీసుకుంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్లుగా తమ గోడు ఎవరు పట్టించుకోలేదని వృద్ధులు, వికలాంగులు వాపోతున్నారు. ఎండ కాస్తున్నా, వర్షం కురుస్తున్నా బియ్యం తీసుకుని ఏరు దాటి గ్రామంలోకి వెళ్లాల్సిందేనని మహిళలు తెలిపారు. శివపురంలో సంవత్సరం క్రితం బీఎస్ఎన్ఎల్ టవర్ ప్రారంభించినా ప్రయోజనం లేదని గ్రామ ప్రజలు చెప్పారు. ప్రస్తుతం అన్ని గ్రామాలలో సెల్ ఫోన్ సేవలు విస్తృతంగా అందుతున్నా తమ గ్రామం మాత్రం ఇంకా పాత కాలంలో ఉన్నదని తెలిపారు. కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకొని గ్రామ సమస్య ను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.


ఊరి బయట బియ్యం పంపిణీ చేస్తున్న ఎండీయూ వాహనం

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోండి

పెద్దతిప్పసముద్రం మే 3 (ఆంధ్రజ్యోతి) :కేంద్రప్రభుత్వం మలు చేస్తున్న జాతీయ గ్రామీణా ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన మండలంలోని రంగసముద్రం పంచాయతీలో ఉపాధిహామీ పనులను పరిశీలించారు. వినసక్రవాండ్ల పల్లెలో నీటి తొట్టెలు, ఫారంపాండ్లు, మినీ గోకులం షెడ్లను పరిశీలించారు. పనులు కల్పించడంలో ఉపాధి సిబ్బంది అలసత్వాన్ని సహించేది లేదన్నారు. అవసరమైన వారికి తక్షణం పనులు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.పనుల్లో చేతి వాటం ప్రదర్శిస్తే చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట ఈసీ సుధాకర్‌తో పాటు పంచాయతీ కార్యదర్శి శివప్రసాద్, ఫీల్డ్ అసిస్టెంట్ శంకర తదితరులు పాల్గొన్నారు.


ఉపాధిహామీ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్

మదనపల్లె మున్సిపాలిటీ మాజీచైర్మన్ ముజీబ్‌హుస్సేన్ మృతి

మదనపల్లె, మే 3(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మున్సిపల్ మాజీ చైర్మన్ గండ్లూరు ముజీబ్‌హుస్సేన్(72) మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న ఆయన మధుమేహం తీవ్రత ఎక్కువ చికిత్స నిమిత్తం రెండురోజుల క్రితం బెంగళూరుకు వెళ్లారు. శనివారం మరోసారి ఆసుపత్రికి రావాలని వైద్యులు సూచించడంతో అక్కడే బంధువుల ఇంట్లో ఉండి పోయారు. రోజూ వేసుకున్నట్లే ఇన్సులిన్ ఇంజక్షన్ వేసుకున్న ఆయన కొద్ది సేపటికే అపస్మారక స్థితిలోకి వెళ్లారు. దీన్ని గమనించిన కుటుంబీకులు సమీపంలోని ఆసుపత్రికి తీసుకెళ్లగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. శుక్రవారం అర్ధరాత్రి ఆయన మృతిచెందగా, శనివారం మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించి అంత్యక్రియలు పూర్తిచేశారు. ఈయన 1987లో మున్సిపల్ వైస్‌చైర్మన్‌గా, 1995 నుంచి 2000 వరకూ మున్సిపల్ చైర్మన్‌గా వ్యవహరించారు. 1999లో ఎమ్మెల్యేగా కాంగ్రెస్ నుంచి పోటీ చేసి స్వల్ప మెజారిటీతో ఓడిపోయారు.

నేతల పరామర్శ

ముజీబ్‌హుస్సేన్ మృతదేహానికి స్థానిక ఎమ్మెల్యే ఎం.షాజహాన్ బాషా, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు జి.శ్రీరామ్‌చినబాబు, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, తంబళ్లపల్లె టీడీపీ నేత కొపూరి మల్లికార్జుననాయుడు, జనసేన నేత గంగారపు రామ్‌దాస్‌చౌదరి, మాజీ ఎమ్మెల్యేలు దొమ్మలపాటి రమేష్, డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డి, బీజేపీ నేత చల్లపల్లె నరసింహారెడ్డి, ఏపీఎండీసీ మాజీ చైర్‌పర్సన్ జి.షమీంఅస్లాం, మైనార్టీ నేతలు పఠాన్ ఖాదర్‌ఖాన్, ఎస్.ఎ. మస్తాన్, కాంగ్రెస్ నేత రెడ్డిసాహెబ్, తదితరులు నివాళులు అర్పించారు. ఆయన మృతికి కారణాలను అడిగి తెలుసుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు.


ముజీబ్‌హుస్సేన్ మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు

విద్యార్థులు పరిశోధనల్లో రాణించాలి

కురబలకోట, మే 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పరిశోధనల్లో రాణించాలని జర్సీ ల్యాబ్స్ సీఈవో శ్రీకాంత్ కె అరిమానిత్యా పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని అంగళ్ల సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన 27వ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో వెంచర్ స్టూడియోను ఏర్పాటు చేశామని దాని ద్వారా విద్యార్థుల, అధ్యాపకుల ఆలోచనలు ఇన్నోవేటివ్‌గా రూపొందించవచ్చునన్నారు. అనంతరం కళాశాల కరెస్పాండెంట్ ఎన్. విజయ భాస్కర్ చౌదరి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్ టెక్నాలజీపైన ఆధారపడి ఉందని, టెక్నాలజీ లేకపోతే మనుగడ లేదన్నారు. కళాశాలకు చెందిన విద్యార్థులు వ్యాపారవేత్తలుగా మారడానికి నూతన ఆవిష్కరణలతో పాటు , ఆలోచనలు ఆచరణలో పెట్టాలన్నారు. విద్యార్థుల కెరియర్‌లో టెక్నికల్ నైపుణ్యాలు ఎంతో కీలక మని దానిని దృష్టిలో ఉంచుకుని మెరుగు పరచుకోవాలన్నారు. అనంతరం వివిధ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సంద ర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కాగా విద్యార్థుల ఈలలు, కేకలతో సభా ప్రాంగణం మార్మోగింది. ఈ కార్యక్రమంలో కరెస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, అకాడమీ ప్రెసిడెంట్ నాదెళ్ళ ద్వారకనాథ్, ప్రిన్సిపాల్ సి.యువరాజ్ తదితరులు అభినందించారు.



మాట్లాడుతున్న కళాశాల కరెస్పాండెంట్ ఎన్. విజయభాస్కర్ చౌదరి

నాటు సారా ఊట ధ్వంసం

పీలేరు, మే 3(ఆంధ్రజ్యోతి): నవోదయం 2.0 కార్యక్ర మంలో భాగంగా శనివారం పీలేరు మండలం సూర్యానాయక్ తాండాలో 200 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేసి, 65 కేజీల బెల్లాన్ని స్వాధీనం చేసుకున్నామని పీలేరు ఎక్సైజ్ సీఐ సుబ్బారెడ్డి తెలిపారు. ఎం.రామదాసు నాయక్, ఎం.ముని శంకరయ్యపై కేసు నమోదు చేశామన్నారు. అంతకు మునుపు అదే గ్రామానికి చెందిన నిర్మలా బాయ్, బి.సరోజమ్మ నుంచి 15 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. వారికి సారాను సరఫరా చేసిన మర్రిమాకులపల్లె తాండా, జాండ్ల తాండాకు చెందిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశామన్నారు.

బెల్లం విక్రయిస్తే కేసులు

పెద్దమండ్యం, మే 3(ఆంధ్రజ్యోతి) నాటు సారా తయారీకి ఉపయోగించే బెల్లం విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్ హెచ్చరించారు. పెద్దమండ్యం, కలిచెర్ల, వెలిగల్లు, తురకపల్లి గ్రామాల్లోని చిల్లర దుకాణాల్లో శనివారం ఆయన తనిఖీలు చేశారు. నాటుసారా తయారీ, విక్రయంపై అవగాహన కల్పించారు. ములకల చెరువు ఎక్సైజ్ సీఐ మాధవి, ఎస్ఐ వెంకటేష్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నాటుసారా స్వాధీనం

పాపేపల్లి గ్రామ పంచాయతీ పి. తురకపల్లిలో 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని, పెద్ద అమీర్ (52) అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు ములకలచెరువు ఎక్సైజ్ సీఐ మాధవి తెలిపారు. ఎక్సైజ్ ఎస్ఐ వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడిలో వృద్ధురాలికి గాయాలు

మదనపల్లె అర్బన్, మే 3(ఆంధ్రజ్యోతి) :పిచ్చి కుక్క దాడిలో వృద్ధురాలు గాయపడింది. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు శనివారం మదనపల్లె మండలం, కొండామర్రిపల్లె గ్రామం బెస్తపల్లెకు చెందిన నారాయణమ్మ (56) శనివారం రోడ్డుపై వెళుతుండగా కుక్క కరిచింది. వెంటనే మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఎన్టీఆర్ నఫీస్‌కు ఎన్టీఆర్ కీర్తి పురస్కారం

పీలేరు, మే 3(ఆంధ్రజ్యోతి): తారక రామారావు విజ్ఞాన కళాక్షేత్రం అధ్యక్షుడు, ఎన్టీఆర్ వీరాభిమాని ఎన్టీఆర్ నఫీస్‌కు డా.ఎన్టీఆర్ కీర్తి పురస్కారం లభించింది. ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవాల సందర్భంగా ఆయన అభిమానులు, వజ్రోత్సవాల నిర్వహణకు తోడ్పాటునందించిన వారికి ఇండియన్ సోఫియో కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం విజయవాడలో ఈ పురస్కారాలు అందించారు. ఎన్టీఆర్ వజ్రోత్సవ నిర్వహణ కమిటీ సభ్యుడైన ఎన్టీఆర్ నఫీస్‌కు ఈ పురస్కారం అందజేశారు. విజయవాడలోని ఓ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో అవనిగడ్డ ఎమ్మెల్యే, రాష్ట్ర మాజీ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్ ఈ పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా నఫీస్ మాట్లాడుతూ మహనీ యుడైన ఎన్టీఆర్ పేరిట ఏర్పాటు చేసిన పురస్కారం లభించడం తనకు సంతోషంగా ఉందన్నారు.


ఎన్టీఆర్ కీర్తి పురస్కారం అందుకుంటున్న ఎన్టీఆర్ నఫీస్

'మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి'

నిమ్మనపల్లి, మే 3(ఆంధ్రజ్యోతి): మహిళలు సామాజికంగా ఆర్థికంగా ఎదగడమే ప్రభుత్వ ధ్యేయం అని ఎంపీడీవో పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యా లయంలో మహిళలకు టైలరింగ్ శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బీసీ మహిళలు ఎదిగి ఆర్థికంగా, సామాజికంగా నిలదొక్కుకునేందకు టైలరింగ్ నేర్పించి, సర్టిఫికెట్‌లతో పాటు కుట్టుమిషన్‌లను పంపిణీ చేస్తుందన్నారు. మండలంలో 120 మంది మహిళలను ఎంపిక చేశామని వీరిని రెండు బ్యాచ్‌లుగా విభజించి ఉదయం, సాయంత్రం టైలరింగ్ నేర్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం మురళి, ఏపీవో రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రమాద బీమాను సద్వినియోగం చేసుకోండి'

నిమ్మనపల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజలు ప్రమాద బీమాను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం రమేష్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ 18 నుంచి 70 ఏళ్ల లోపు వయసు, స్థానిక బ్యాంకులో ఖాతా కలిగి ఉన్న వారి నుంచి ఏడాదికి రూ.20 చొప్పున బీమా కంపెనీ వారు జమ చేసుకుంటారని తెలిపారు. ఏదైనా ప్రమాదం జరిగి మరణిస్తే రూ. 2 లక్షలు బాధిత కుంటుంబానికి చెల్లిస్తారని తెలిపారు. అలాగే, 18 నుంచి 50 ఏళ్లలోపు వయసు వారు ఏడాదికి రూ.436 చెల్లిస్తే జీవిత బీమా లభిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

మైనారిటీలకు స్వయం ఉపాధి సబ్సిడీ రుణాలు

పీలేరు/నిమ్మనపల్లి, మే 3(ఆంధ్రజ్యోతి): మైనారిటీలకు ప్రభుత్వం సబ్సిడీపై రుణాలు అందజేస్తోందని పీలేరు, నిమ్మనపల్లి మండలాల ఎంపీడీవోలు శివశంకర్, పరమేశ్వరరెడ్డి శనివారం వేర్వేరుగా ప్రకటించారు రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు రుణాలు అందిస్తారని, ఎంపికైన వారికి 50 శాతం సబ్సిడీ లభిస్తుందన్నారు. అర్హత కలిగిన వ్యక్తులు ఈ నెల 25వ తేదీలోపు ఏపీవోబీఎంఎంఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పీలేరులోని యూనియన్ బ్యాంకుకు 14 యూనిట్లు, ఇండియన్ బ్యాంకుకు 8, బ్యాంక్ ఆఫ్ బరోడాకు 13, పీలేరులోని సప్తగిరి గ్రామీణ బ్యాంకుకు 13, దొడ్డిపల్లెలోని సప్తగిరి గ్రామీణ బ్యాంకుకు 12, తలపులలోని సప్తగిరి గ్రామీణ బ్యాంకుకు 13, పీలేరులోని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియాకు 13 యూనిట్లు మంజూరైనట్లు ఎంపీడీవో తెలిపారు. .

'వేసవిలో ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి'

వాల్మీకిపురం, మే 3(ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో సంభవించే ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాల్మీకిపురం మండల హెల్త్‌ఎడ్యుకేటర్ మహ్మద్‌రఫీ హెచ్చరించారు. శనివారం మండలంలోని చింతపర్తి పంచాయతీ కోటపల్లెలో వేసవి ప్రమాదాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చికిత్సలను వివరించారు. ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి కాలంలో పాముకాటు, జెర్రి, తేలు కుట్టు, తేనెటీగలు, కుక్కకాటు, వడదెబ్బ, విషపురుగులు, ఈతకు వెళ్లి మునిగిపోవుట తదితరాల కారణంగా చిన్న పిల్లల మరణాలు, విద్యుత్ షార్ట్ సర్క్యూట్, అగ్ని ప్రమాదాలు ఎదురైనపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో వైద్య సిబ్బంది బానుబీ, హృదయేశ్వరి, ఆశా వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

పెద్దతిప్పసముద్రం మే 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పెద్దచెరువులో నాలుగేళ్ల క్రితం ఏర్పాటు చేసిన బోరు అప్పట్లో బారీ వరాల కారణంగా మునిగి పోయింది. ప్రస్తుత సర్పంచ్ ఆధ్వర్యంలో అధికారులు నాలుగు రోజుల పాటు శ్రమించి ఆ బోరులో ఉన్న మోటర్, పైపులు వెలికి తీసి మరమ్మతులు చేసి, విద్యుత్ కనెక్షన్, పైపులైన్‌ను పునరుద్ధరించారు. దీంతో పీటీఎంలో తాగునీటి సమస్యకు పరిష్కారం లభించింది. పైప్ లైన్ పనులను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పరిశీలించారు. స్థానిక సర్పంచ్ తమక శంకర, పంచాయతీ సిబ్బంది సురేంద్రబాబు, శంకర, రమణ, వాటర్ మ్యాన్ రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.


బోరుకు మరమ్మతులు చేస్తున్న పంచాయతీ సిబ్బంది

ప్రభుత్వ ఆసుపత్రిలో పారిశుధ్య పనులు

కలికిరి, మే 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో శనివారం పారిశుధ్య పనులు ప్రారంభమయ్యాయి. వైద్యశాల భవనాల కింద ఉన్న మురుగు కాలువ కారణంగా దోమల బెడద అధికంగా ఉందని పలువురు వైద్యులు గురువారం జరిగిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే నల్లారి దృష్టికి తెచ్చారు. సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించడంతో గ్రామ పంచాయతీ అధికారులు అంచనాలు రూపొందిస్తున్నారు. సర్పంచు యల్లయ్య, పంచాయతీ కార్యదర్శి జి.అశోక్, అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు యోగేష్ రెడ్డి పనులను పర్యవేక్షిస్తున్నారు. వైద్యశాలకు తూర్పు రోడ్డు వైపు ప్రహరీ గోడ నిర్మించాలని వైద్యాధికారి డాక్టర్ పవన్‌కుమార్ చేసిన విన్నపంపై ఉపాధి హామీలో తక్షణ చర్యలు తీసుకోవలసిందిగా కూడా ఎమ్మెల్యే ఆదేశించారు.


ఆసుపత్రిలోని మురుగు కాలువను పరిశీలిస్తున్న పంచాయతీ అధికారులు


గాలి, తుంపర్ల ద్వారా క్షయ వ్యాధి వ్యాప్తి

కలికిరి, మే 3 (ఆంధ్రజ్యోతి): గాలి, తుంపర్ల ద్వారా క్షయ వ్యాధి వ్యాప్తి చెందే ప్రమాద ముందని వైద్యాధికారులు తెలిపారు. శనివారం కలికిరి పంచాయతీ మాదిగపల్లెలో నిర్వహించిన 104 వైద్య శిబిరంలో క్షయ వ్యాధి బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. రెండు వారాలకు పైపడి దగ్గు, ఛాతీలో నొప్పి, గస, ఆయాసం, గళ్లలో రక్తం పడటం, రాత్రుళ్ళు జ్వరం రావడం వంటి లక్షణాల కారణంగా టీబీ వ్యాధిని అనుమానించవచ్చు న్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా గళ్ల పరీక్షలు చేసి వ్యాధిని నిర్ధారిస్తారన్నారు. క్షయ వ్యాధి నిర్ధారణ అయితే పీఎం పోషణ యోజన పథకం కింద పౌష్టికాహారం కోసం నెలకు రూ.వేయి వంతున వ్యాధిగ్రస్తుల ఖాతాలో ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. ఏమాత్రం అనుమానిత లక్షణాలున్నా స్థానిక ఏఎన్ఎం దగ్గర సివైటీబీ (కటానియస్ ట్యూబర్క్యులిన్) పరీక్ష చేయించుకోవాలని సూచించారు. పాజిటివ్‌గా నిర్ధారణ అయితే మూడు నెలలు చికిత్స తీసుకోవాల న్నారు. అనంతరం ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేడికుర్తి పీహెచ్‌సీ వైద్యాధికారిణి కావ్యగంధ, హెల్త్ ఎడుకేటర్ మహ్మద్ రఫీ, టీబీ పర్యవేక్షకుడు నాగి రెడ్డి, ఏఎన్ఎం నఫీసా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


టీబీ వ్యాధిపై అవగాహన కలిగిస్తున్న వైద్యాధికారులు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మదనపల్లె అర్బన్, మే 3(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన తప్పదంటూ శనివారం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో కార్మికులు మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 20న దేశవ్యాప్తంగా నిర్వహించే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యూని యన్ జిల్లా ఉపాధ్యక్షురాలు ఇంద్రాణి, ట్రెజరర్ దేవేంద్ర, మదనపల్లె ప్రధాన కార్యదర్శి నాగరాజ, నాయకులు పృథ్వీరాజ్, ముబారక్, ఏఐటీయూసీ టౌన్ కార్యదర్శి తిరుమల, శ్రీనివాసులు, ఉమారాణి, భాగ్యలక్ష్మి, రాధ, వంశీ, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.


మున్సిపల్ కమిషనర్‌కు ప్రమీలకు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

శేషప్ప తోటలో యువకుడిది హత్యే..

మదనపల్లె అర్బన్, మే 3 (ఆంధ్రజ్యోతి):మదనపల్లె పట్టణం, శేషప్పతోటలో శుక్రవారం రాత్రి యువకుడిని రాళ్లతో కొట్టి చంపేశారని మృతుడి సోదరి శశికళ ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే బసినికొండలో నివాసం ఉన్న సునీల్ కుమార్ మిత్రుడు బాలాంజనేయులు అలిమాస్ బాలిపై అనుమానంతో కేసును నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. విచారణచేసి వాస్తవాలు బయటకు తీస్తామని సీఐ వివరించారు. సునీల్ కుమార్‌కు ఇటీవలే స్మృతితో వివాహం అయినట్లు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

గాలివాన బీభత్సం

● పడిపోయిన స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ● తడిసిన పంట దిగుబడులు



ఎంకుపల్లె పొలంలో పడిపోయిన విద్యుత్ స్తంభం, ట్రాన్స్‌ఫార్మర్

దువ్వూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): ప్రశాంతంగా ఉన్న ప్రకృతి ఒక్కసారిగా విజృంభించింది. శుక్రవారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. పొలాల్లో విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు కింద పడ్డాయి. పసుపు, నువ్వులు, మొక్కజొన్న, వేరుశనగ పంటలు ఆరబెట్టగా అవి తడిసిపోయాయి. సుమారు గంటపాటు గాలివాన ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేసింది. పలుచోట్ల రేకుల షెడ్డులు విరిగిపడ్డాయి. మండల వ్యాప్తంగా ఆరు చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు పడిపోయాయని, 35 కరెంటు స్తంభాలు కిందపడ్డాయని, అర్థ కిలోమీటరు మేరకు విద్యుత్తు వైర్లు తెగిపడ్డాయని ఏఈ నరేంద్రారెడ్డి తెలిపారు. సుమారు రూ.10 లక్షల మేరకు నష్టం వాటిల్లినట్లు వ్యక్తమవుతోంది. వ్యవసాయ శాఖకు సంబంధించి మైదుకూరు ఏడీఏ కృష్ణమూర్తిని సంప్రదించగా పంట నష్టం జరిగినట్లు మండలాల నుంచి ఎటువంటి ఫిర్యాదులు లేవన్నారు.



జమ్మలమడుగులో విరిగిన విద్యుత్తు స్తంభం.. తెగిన తీగెలు

నేలకొరిగిన మామిడి చెట్లు

పోరుమామిళ్ల, మే 3(ఆంధ్రజ్యోతి): గాలివాన బీభత్సానికి రంగసముద్రం పంచాయతీ పరిధిలోని గాయకవాడ సుబ్బారావుకు చెందిన మామిడి తోటలో దాదాపు నాలుగు టన్నుల మామిడికాయలు నేలరాలాయి. 13 చెట్లకు పైగా నేలకొరిగాయి. కాపు చేతికి వచ్చి ఉండింటే టన్ను రూ.70వేలు ధర పలికేదని, ఈ అకాల వర్షం కారణంగా కనీసం రూ.10వేలు కూడా పలికే పరిస్థితి లేదని రైతు వాపోయారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై ఉద్యానశాఖ అధికారి శ్రీనివాసులరెడ్డిని వివరణ కోరగా తమ సిబ్బందిని పంపి నష్టం అంచనా వేస్తామన్నారు.



రూ.15లక్షలు మేర నష్టం

చెన్నూరు, మే 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో గురు, శుక్రవారాల్లో వీచిన ఈదురు గాలులకు కొండపేట, రామనపల్లె, గోపవరం, ఓబులం పల్లె, ఆలంఖాన్‌పల్లె గ్రామాల్లోని బయటి ప్రాంతాల్లో దాదాపు 20 విద్యుత్‌స్తంభాలు నేలకొరిగాయి. పూర్తిగా పలుచోట్ల విద్యుత్‌స్తంభాలు నెర్ర ఉబారాయి. దీంతో విద్యుత్‌తీగలు సైతం తెగి నేలపై పడ్డాయి. సుమారుగా రూ.15లక్షల మేర నష్టం వాటిల్లినట్లు ట్రాన్స్‌కో ఈఈ రామలింగారెడ్డి తెలిపారు. అలాగే 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు 8, ఆరు సింగిల్‌ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు, ఐదు 16కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు సైతం దెబ్బతిన్నాయని, వీటిలో సాగునీటి అవసరాలకు ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను రేయింబవళ్లు పనిచేసి తెల్లారేసరికి సిబ్బంది బాగు చేయడం, కొత్తవి తెచ్చి పెట్టడం జరిగిందని తెలిపారు.

విరిగిపడిన స్తంభాలు

జమ్మలమడుగు, మే 3 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో శుక్రవారం రాత్రి ఈదురు గాలులు వీచాయి. దీంతో పట్టణంలోని పలు ప్రాంతాల్లో, గ్రామాల్లో చెట్లు, కొమ్మలు విరిగిపడ్డాయి. పెద్దపసుపుల మోటులోని తేరురోడ్డు ఎదురుగా కరెంటు స్తంభాలు విరిగిపడ్డాయి. అలాగే విద్యుత్తు తీగెలు రోడ్డుపొడవునా పడ్డాయి. అనేక చోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. దీంతో పలు ప్రాంతాల్లో విద్యుత్తు అంతరాయం కలిగింది. ప్రజలు అంధకారంలో దోమలతో కొంత ఇబ్బందులు పడ్డారు.

క్రమశిక్షణ, నైతిక విలువలు కలిగి ఉండాలి

● జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ షంషుద్దీన్



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న డీఈవో షంషుద్దీన్

బద్వేలు రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, దేశభక్తి, సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాలని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ షంషుద్దీన్ అన్నారు. శనివారం స్థానిక బిజివేముల వీరారెడ్డి డిగ్రీ కాలేజీ ఆవరణలోని ఇండోర్ ఆడిటోరియంలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) ఆధ్వర్యంలో ఇటీవల పది పరీక్ష ఫలితాల్లో బద్వేలు, గోపవరం మండలాల్లోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదివి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచిపేరు తీసుకురావాలని, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. అనంతరం అధిక మార్కులు సాధించిన సుమారు 30 మంది విద్యార్థులకు నగదు, మెమెంటో, ప్రశంసాపత్రం అందించారు. కార్యక్రమంలో ఉప విద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి, ఆపస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామాంజనేయ ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, జిల్లా అధ్యక్షుడు ఎస్.చెన్నయ్య, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి, ఎంఈవో సునీల్‌కుమార్, ఆపస్ నాయకులు అంకయ్య, వెంకట్రామిరెడ్డి, రామక్రిష్ణంరాజు, శ్రీధరరెడ్డి, తిరుమలరెడ్డి పాల్గొన్నారు.

కడప ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ బదిలీ

● కొత్త ప్రిన్సిపాల్‌గా డాక్టర్ జమున

కలికిరి, మే 3(ఆంధ్రజ్యోతి): కడప ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న డాక్టర్ సురేఖను బదిలీ చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. డాక్టర్ సురేఖను నంద్యా ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమించింది. ఆమె స్థానంలో కడప ప్రిన్సిపాల్‌గా ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న డాక్టర్ టి.జమునను నియమించారు. ఈ మేరకు ప్రభుత్వ ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి శనివారం ఆదేశాలు జారీ చేశారు.

పూడ్చిపెట్టిన మృతదేహానికి శవ పరీక్ష



మృతదేహానికి శవపరీక్ష నిర్వహిస్తున్న వైద్యులు

చెన్నూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు కొత్తగాంధీనగర్‌కు చెందిన సుందరరావు (63) గత ఏడాది డిసెంబరు 15న మృతి చెందడం జరిగింది. ఆ మృతదేహాన్ని పూడ్చిపెట్టగా బంధువులు కోరిక మేరకు శనివారం దానికి శవ పరీక్ష చేయడం జరిగింది. రిమ్స్ అసిస్టెంటు ప్రొఫెసర్ డాక్టర్ సుధాకర్ సీఐ కృష్ణారెడ్డి, తహసీల్దారు సరస్వతి, ఆర్ఐ కౌశిక్‌ల ఆధ్వర్యంలో ఈ శవ పరీక్ష నిర్వహించారు. కాగా గత ఏడాది అక్టోబరు 21న ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో సుందరరావుకు బలమైన గాయాలయ్యాయని, రిమ్స్‌కు అనంతరం తిరుపతి స్విమ్స్‌కు తీసుకువెళ్లగా డిసెంబరులో సర్జరీ చేశారు. చికిత్స పొందుతూ అక్కడే చనిపోవడం జరిగింది. కాగా ప్రమాదం విషయం పోలీసుస్టేషనులో చెప్పకపోవడంతో ఎలాంటి కేసులు నమోదు కాలేదు. చివరికి బంధువులు జిల్లా పోలీసు అధికారులను ఆశ్రయించడంతో వారి సూచనల మేరకు శనివారం మృతదేహాన్ని బయటికి తీసి శవ పరీక్ష చేశారు.

ఇద్దరు మట్కా బీటర్ల అరెస్టు

కడప క్రైం, మే 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో ఇద్దరు మట్కాబీటర్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ అమర్‌నాథరెడ్డి తెలిపారు. శనివారం ఆయన తెలిపిన వివరాల మేరకు.. పాతబస్టాండు సమీపంలో మట్కా ఆడుతున్నారన్న పక్కా సమాచారంతో సీఐ రామకిష్ణ ఆదేశాల మేరకు దాడి చేశామన్నారు. ఈ దాడిలో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వీరి వద్ద నుండి 12,200 నగదు, మొబైల్ ఫోను, మట్కాస్లిప్పులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అశ్వవాహనంపై శివకేశవులు

వల్లూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): పుష్పగిరి బ్రహ్మోత్సవాల్లో భాగంగా అశ్వవాహనంపై శివకేశవులు భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. శనివారం ఉదయం పరమేశ్వరునికి, కామాక్షి అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం లఘు పూర్ణాహుతి, సాయంత్రం వైద్యనాథేశ్వరుని సుందరంగా అలంకరించి అశ్వవాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు.

పీలేరులో ఈదురుగాలుల బీభత్సం

● నేల రాలిన మామిడి

● ధ్వంసమైన పాలి హౌజ్



రైతు వెంకటరమణారెడ్డి తోటలో ధ్వంసమైన పాలి హౌజ్

పీలేరు, మే 3(ఆంధ్రజ్యోతి): పీలేరులో శనివారం మధ్యాహ్నం వీచిన ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. గాలుల తీవ్రతకు మండలంలోని పలుచోట్ల మామిడి పంట నేలరాలిపోగా కొన్నిచోట్ల షెడ్లు పాక్షికంగా ధ్వంసమయ్యాయి. పీలేరు మండలం ఇందిరమ్మ కాలనీ సమీపం లోని ఆదర్శ రైతు దేవిరెడ్డి వెంకటరమణారెడ్డి తోటలోని పలు చెట్లలో మామిడి పండ్లు నేలరాలాయి. అతని పొలంలోని పాలి హౌజ్ పాక్షికంగా ధ్వంసమైంది. దీంతో తనకు సుమారు రూ.3 లక్షల దాకా నష్టం వాటిల్లిందని వెంకటరమణారెడ్డి వాపోయారు. అదే విధంగా రామిరెడ్డిగారిపల్లెకు చెందిన రైతు గరుడారెడ్డి తోటలోనూ మామిడి నేల రాలిపోయింది. తన తోటలోని అధిక శాతం చెట్లలోని మామిడి పండ్లు నేలరాలిపోయాయరని, తద్వారా తనకు రూ.5 లక్షల దాకా నష్టం వాటిల్లిందని గరుడారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అసలే అంతంత మాత్రంగా ఉన్న పంట, ఈదురు గాలికి నేలరాలిపోవడంతో తాను పూర్తిగా నష్టపోయాయని ఆయన తెలిపారు.

రాజా ఫౌండేషన్ భూములు స్వాధీనం

● నిబంధనల ఉల్లంఘనతో 50.37 ఎకరాలు ప్రభుత్వపరం



రాజా ఫౌండేషన్‌కు ఇచ్చిన స్థలాలను స్వాధీనం చేసుకొని బోర్డు ఏర్పాటు చేసిన తహసీల్దారు, సిబ్బంది

ప్రొద్దుటూరు, మే 3(ఆంధ్రజ్యోతి): మైలవరం మండల హెడ్‌క్వార్టర్స్‌లో రాజా ఫౌండేషన్‌కు 2005, 2009 సంవత్సరాలలో అప్పటి మార్కెట్ వాల్యూతో ఇచ్చిన 50.47 ఎకరాల భూములను నిబంధనల ఉల్లంఘన కారణంగా తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. శనివారం తహసీల్దారు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దారు మల్లికార్జున, మండల సర్వేయర్ సాయిలత, వీఆర్‌వో షాబుద్దీన్ తమ సిబ్బందితో కలిసి రాజా ఫౌండేషన్‌కు ఇచ్చిన భూములలో బోర్డులు పాతారు. మైలవరం గ్రామ పొలం సర్వే నెంబరు 74/1లో 12 ఎకరాలు అనాథ పిల్లలకు పునరావాస కేంద్రనిర్మాణంతో పాటు వృత్తి శిక్షణ కేంద్ర నిర్మాణం, గ్రామీణ నిరుద్యోగులకు ఉపాధి కల్పన కోసం కేటాయించారు. అలాగే సర్వే నెంబరు 74/2లో 3.03 ఎకరాలు, సర్వేనెంబరు 82లో 7.90 ఎకరాలు, 83/1లో 6.54 ఎకరాలు, 84/1లో 11.12 ఎకరాలు, 85/1లో 7.41 ఎకరాలు, 86లో 4.00 ఎకరాలు మొత్తం 40 ఎకరాలలో ఎయిడ్స్ రోగుల పునరావాస కేంద్రం, అనాథ పిల్లలు, వీధి బాలలు, వికలాంగులకు ఫిజియోథెరపి సెంటర్‌తో పాటు విద్యా కేంద్రాలు నిర్మించాలని కేటాయించారు. ఫిబ్రవరి, మార్చి నెలల్లో తహసీల్దారు, ఆర్డీవోలు ఈ భూములు ప్రభుత్వ నిబంధనల మేరకు వినియోగింపబడుతున్నాయా లేదా అని విచారించి కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. ఈ భూముల్లో కేవలం సర్వేనెంబరు 74/1లోని 12 ఎకరాలలో డాడీ హోం బిల్డింగ్ 1.00 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించారు. ఎయిడ్స్ రోగుల పునరావాస కేంద్రం 10సెంట్లలో, బీఈడీ కాలేజీ 0.40 సెంట్లలో, పశువుల కొట్టం 0.10 సెంట్లలో, మూడు సెంట్లలో సమాధి నిర్మించి వున్నారని మొత్తం 12 ఎకరాలలో 1.63 ఎకరాలు తప్ప తక్కిన 10.37 ఎకరాలు ఖాళీగా వుంది. అలాగే పైసర్వేనెంబర్లలోని 40 ఎకరాల్లో కూడా ఏ ఒక్క నిర్మాణం చేపట్టక నిరుపయోగంగా వున్నదని తమ నివేదికలో పేర్కొన్నారు. నిరుపయోగంగా ఉన్న మొత్తం 50.37 ఎకరాల భూ ములను రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకుని బోర్డులు ఏర్పాటు చేశారు.

ట్రాక్టర్ పైనుంచి పడి యువకుడి మృతి

రాజంపేట టౌన్, మే 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్ఎస్ రోడ్డులో ఓ ఇసుక ట్రాక్టర్‌పై కూర్చొని ప్రయాణిస్తున్న బి.వెంకటేశ్(28) ప్రమాదవశాత్తు కిందపడి మృ తి చెందాడు. శనివారం సాయంత్రం హే మాద్రిపల్లెకు చెందిన వెంకటేష్ ఇసుక క్వా రీ నుంచి పట్టణానికి తీసుకొని వస్తూ డ్రై వర్ సీట్ వద్ద కూర్చున్న వెంకటేష్ ప్రమా దవశాత్తు టైర్ కిందపడటంతో తలకు తీ వ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. రాజంపేట పట్టణ పోలీసులు కేసు నమో దు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పద్మశాలీయ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

కడప మారుతీనగర్, మే 3 (ఆంధ్రజ్యోతి): విద్యలో మరింత ప్రోత్సాహం అందించాలనే లక్ష్యంతో ఉత్తమ ఫలితాలు సాధించిన పద్మశాలీయ విద్యార్థులకు ప్రతి భా పురస్కారాలు అందజేయనున్నట్లు పద్మశాలీయ సేవా సంఘం అధ్యక్షుడు అవ్వారు సుబ్బరాయుడు తెలి పారు. శనివారం స్థానిక చిన్నచౌక్ వద్ద గల పద్మశాలీ భవన్(కళ్యాణమండపం)లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానంగా 10వ తరగతిలో 550 మార్కులకు పైగా, అలాగే ఇంటర్, ఎంపీసీ, బైపీసీ విభాగాలలో 900 మార్కులకు పైగా, ఆర్ట్స్ గ్రూపులలో 800 మార్కులకు పైగా, ఎంసెట్ ఇం జనీరింగ్, నీట్ మెడిసిన్ విభాగాలలో జిల్లా స్థాయిలోనే కాకుండా పట్టణ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించి నవారు అర్హులన్నారు. మార్కుల జాబితాతో పాటు టీసీ జిరాక్స్‌కాపీ, రెండు పాస్‌పోర్టుసైజ్ ఫొటోలు, ఫోన్ నెంబర్, బయోడేటాతో సహా పూర్తిచేసిన దరఖాస్తులను జూన్ 5లోగా పద్మశాలీభవన్‌కు పంపించాలన్నారు. ఇతర వివరాలకు 9849026877, 9885122084 అనే నెంబర్ల ను సంప్రదించాలన్నారు. సమావేశంలో పద్మశాలీయ సేవాసంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు అవ్వారు వెంకటసుబ్బయ్య, విద్యాకమిటీ కన్వీనర్ వెంకటసుబ్బయ్య, యానాదయ్య, వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

కలికిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో

ముదురుతున్న వివాదం

● వాయల్పాడు కోర్టుకు వెళ్లిన వ్యవహారం

● జేసీ ఆదేశాలతో విచారణ కమిటీ ఏర్పాటు

● విచారణలో అధికారుల తాత్సారం



కలికిరి ఉన్నత పాఠశాల ముందు భాగం

కలికిరి, మే 3 (ఆంధ్రజ్యోతి): చైల్డ్ కేర్ లీవ్ విషయంలో ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయుడి మధ్య నెలకొన్న వివాదం ముదురుతోంది. సీసీఎల్ సెలవుకు సరైన ఆధారాలు లేవంటూ కలికిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఓ ఉపాధ్యాయుడికి సెలవు మంజూరు చేసేందుకు తిరస్కరించడంతో వివాదం ప్రారంభమైంది. భార్య లేనట్లయితే పిల్లల ఆలనాపాలన చూడటానికి 180 రోజులు విడతల వారీగా సెలవు పొందేందుకు అవకాశముంది. ఈ విషయంలో ఆ ఉపాధ్యాయుడికి భార్య లేనట్లు రెవెన్యూ అధికారుల నుంచి కుటుంబ సభ్యుల ధ్రువీకరణపత్రం సమర్పించాలని హెచ్ఎం కోరినట్లు తెలిసింది.

వాయల్పాడు కోర్టు లీగల్ సెల్‌కు వెళ్లిన వ్యవహారం

సెలవు విషయంలో వివాదం కొలిక్కి రాకపోవడంతో ఉపాధ్యాయుడు వాయల్పాడు కోర్టులోని లీగల్ సెల్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై కోర్టుకు హాజరు కావలసిందిగా జిల్లా విద్యాశాఖ అధికారిని, హెచ్ఎంను, ఉపాధ్యాయుడిని న్యాయాధికారి ఆదేశించారు. డీఈవోకు బదులుగా ఎంఈవో హాజరయ్యారు. తన పిల్లలకు తల్లి లేదని, రెండో భార్య తల్లి స్థానం పూరించలేదని ఉపాధ్యాయుడి వాదనగా వుంది. పూర్వాపరాలు పరిశీలించిన న్యాయాధికారి సీసీఎల్ విషయంలో పైఅధికారుల నుంచి వివరణ పొందాల్సిందిగా సూచిస్తూ ఫిర్యాదును ముగించినట్లు సమాచారం.

కలెక్టరు ఆదేశాలతో విచారణ కమిటీ ఏర్పాటు

కోర్టు అభిప్రాయం తరువాత తన పరిస్థితి ఆత్మహత్యా సదృశంగా మారిందని ఉపాధ్యాయుడు సోషల్ మీడియాకెక్కాడు. దీంతో కలవరపడిన హెచ్ఎం జాయింట్ కలెక్టరు వద్దకెళ్లి వివరాలు చెప్పినట్లు తెలిసింది. దీంతో వ్యవహారంపై విచారణ చేయించాలని జేసీ ఆదేశాలు జారీ చేశారు. కురబలకోట, బి.కొత్తకోట, కలికిరి ఎంఈవోలతో కమిటీని ఏర్పాటు చేసి విచారణ నివేదిక ఇవ్వాల్సిందిగా డీఈవో ఆదేశాలు జారీ చేశారు. విచారణ జరిగి నిజానిజాలు తేల్చకపోవడంతో ఈ వివాదం ఇప్పటికీ సద్దుమణగలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విచారణ పూర్తి చేయాల్సి వుంది.

సీసీఎల్‌పై వివాదం నిజమే..



ఉపాధ్యాయుడికి సీసీఎల్ మంజూరుకు సంబంధించి వివాదమున్న సంగతి వాస్తవమే. అయితే, ఆ ఉపాధ్యాయుడి కుటుంబ విషయాలను బహిరంగ చర్చకు పెట్టలేం. అధికారుల విచారణతోనే దీనికి ముగింపు పలకాల్సి వుంది.

- శారద, హెచ్ఎం, కలికిరి ప్రభుత్వ ఉన్నతపాఠశాల